అభివృద్ధిలో కొంచెం మోదం ఖేదం

సీఎం-కలెక్టర్ల కాన్ఫరెన్సులో వెల్లడైన జిల్లా సమాచారం

ఐదేళ్ల జగన్ పాలనలో కుప్పకూలిన వ్యవస్థలను నిలబెట్టుకోవడానికి కూటమి ప్రభుత్వం పెద్ద కసరత్తుకే పూనుకుంది. జిల్లాలవారీగా ఆయా రంగాల ప్రస్తుత స్థితిని సమాచార ప్రధానంగా బేరీజు వేసి, తగిన లక్ష్యాలను నిర్దేశించుకునేందుకు సిద్ధమైంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగాల నుంచి బోలెడు సమాచారాన్ని పోగేసుకుని మథిస్తోంది. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో బుధవారం మొదలైన జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ సదస్సులో పాల్గొంటున్నారు. సదస్సులో వెల్లడైన సమాచారం ఆధారంగా జిల్లా వర్తమాన స్థితిగతులు ఇలా ఉన్నాయి...

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జీవీఏలో జిల్లాకు నాలుగో స్థానం



జిల్లాలో జీవీఏ (స్థూల విలువ జోడింపు) రూ. 63,354 కోట్లుగా ప్రభుత్వం లెక్కించింది. రాష్ట్ర జీవీఏలో జిల్లా వాటా 5.18 శాతంగా నమోదైంది. జీవీఏ పరంగా రాష్ట్రంలో నాలుగో తిరుపతి జిల్లా 4వ స్థానంలో నిలుస్తోంది. ఇక జిల్లాలో ఒక ఏడాదిలో జరిగే వస్తు ఉత్పత్తుల, సేవల మొత్తం విలువ (జీడీడీపీ) రూ.67 వేల కోట్లుగా గుర్తించారు. 2022-23లో ఈ మొత్తం రూ. 67,487 కోట్లు వుండగా రానున్న ఐదేళ్లలో అంటే 2028-29 నాటికి ఇది రూ. 1,69,469 కోట్లకు చేరుకుంటుందని అంచనా కట్టారు. ఈవిధంగా రాష్ట్ర ఆర్థిక రంగానికి జిల్లా కీలక తోడ్పాటునందించే స్థాయిలో వుందని ఈ అంకెలు చెబుతున్నాయి.

వద్దన్నా డెప్యుటేషన్లు



రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను ఇతర చోట్లకు డెప్యుటేషన్ వేయరాదంటూ ప్రభుత్వం స్పష్టంగా ఆదేశించింది. అయినా జిల్లాలో సచివాలయ ఉద్యోగుల డెప్యుటేషన్లు జరుగుతూనే వున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. అత్యవసర పరిస్థితుల్లో అది కూడా వారం రోజులకు మించకుండా డెప్యుటేషన్ వేయచ్చునని పరిమితులు విధించింది. కేవలం సీఆర్‌డీఏకి డెప్యుటేషన్ వేయడాన్ని మాత్రమే అనుమతించింది. కానీ జిల్లాలో ఏకంగా 122 మంది సచివాలయ ఉద్యోగులు డెప్యుటేషన్లపై ఇతర చోట్ల విధులు నిర్వర్తిస్తున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులను డెప్యుటేషన్‌పై బదిలీ చేయడంలో జిల్లా నాలుగో స్థానంలో వుండడం గమనార్హం. ఇక వీరి హాజరు శాతం కూడా తక్కువగా ఉంటోంది. ఈ నెల మొదటి వారంలో నమోదైన ఉద్యోగుల హాజరు రికార్డులను పరిశీలిస్తే 5400 మంది ఉద్యోగుల్లో 4068 మంది మాత్రమే హాజరు నమోదు చేసుకున్నారు. 1332 మంది హాజరు నమోదు కాలేదు.

పారిశ్రామికం భేష్.. వ్యవసాయంలో వెనుకడుగు



ఏడాదికి రూ. 24,505కోట్లు విలువైన పారిశ్రామిక ఉత్పత్తులు, సేవలు జిల్లా నుంచీ అందుతున్నాయి. ఈ రంగంలో రాష్ట్ర జీవీఏలో జిల్లా 7.78 శాతం వాటాతో ఏకంగా రెండవ స్థానంలో నిలిచింది. అదే విధంగా సేవా రంగంలో కూడా జిల్లా జీవీఏ రూ. రూ. 25,966 కోట్లుగా రికార్డు అయింది. ఈ రంగంలో రాష్ట్ర జీవీఏలో 5.44 శాతం వాటాతో నాలుగో స్థానంలో నిలిచింది. అయితే వ్యవసాయ రంగంలోమాత్రం గణనీయంగా వెనుకబడింది. వ్యవసాయ రంగంలో జిల్లా జీవీఏ రూ. 12,883 కోట్లు కాగా రాష్ట్ర జీవీఏలో జిల్లా వాటా కేవలం 3.01 శాతం మాత్రమే. ఈ విషయంలో జిల్లా 18వ స్థానంతో వెనుకబడింది.

పంటల బీమాలో దారుణ వైఫల్యం



జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద పంటల బీమా పథకం అమలు చేయడంలో అధికార యంత్రాంగం దారుణంగా వెనుకబడింది. జిల్లాలో ఈ పథకం కింద మొత్తం 1.96 లక్షల ఎకరాలను ప్రభుత్వం నోటిపై చేసింది. ఈనెల 9వ తేదీ నాటికి ఇందులో కేవలం 112 ఎకరాలకు మాత్రమే పంటల బీమా పథకం వర్తించేలా జిల్లా యంత్రాంగం ఎన్‌రోల్ చేసింది. నిర్దేశించిన లక్ష్యంలో ఇది 0.06 శాతం. పంటల బీమా కోసం వచ్చిన దరఖాస్తులు 263 మాత్రమే. సంబంధిత శాఖ యంత్రాంగం రైతులకు అవగాహన కల్పించి పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచడంలో విఫలమైనట్టు కనిపిస్తోంది.

రోడ్ల నిర్మాణంలోనూ అట్టడుగున

ఉపాధి హామీ పథకం కింద చేపట్టే సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కంకర రోడ్ల నిర్మాణంలో కూడా జిల్లా అట్టడుగు నుంచీ రెండవ స్థానంలో నిలిచింది. ఈ మూడు రకాల రోడ్లకు సంబంధించి 951 పనులు మంజూరు కాగా అందులో 761 పనులు ప్రారంభమయ్యాయి. ఈ అంశంలో తిరుపతి జిల్లా 25వ స్థానంలో వుంది.



ఉపాధి నిధుల వ్యయంలో అట్టడుగున..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా యంత్రాంగం తీరు ప్రభుత్వాన్ని అసంతృప్తికి గురి చేసేలా వుంది. మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధుల వ్యయంలో జిల్లా ఏపీ మొత్తం మీద అట్టడుగున నిలిచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 194 కోట్లు వ్యయం చేయాల్సి ఉండగా ఈనెల 9 వరకూ కేవలం రూ. 33.64 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈరంగంలో చిత్తూరు 10వ స్థానంలో ఉండగా తిరుపతి జిల్లా 17.34 శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

అడవుల్లో మనం మూడో స్థానం



జిల్లాలో మొత్తం 2644.87 చదరపు కిలోమీటర్ల నోటిఫైడ్ ఫారెస్ట్ ఏరియా వుంది. జిల్లా మొత్తం విస్తీర్ణంలో ఇది 37.35 శాతం. అడవులకు వెలుపల మరో 430.10 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో చెట్లు వున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. అటవీ విస్తీర్ణంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మొదటి స్థానంలోనూ, పార్వతీపురం మన్యం జిల్లా రెండో స్థానంలోనూ వుండగా తిరుపతి జిల్లా మూడో స్థానంలో నిలిచింది.

గోకులాలలో 10వ స్థానం

జిల్లాలో ఉపాధి హామీ పథకం నిధులతో గోకులాలు పేరిట పాడిపశువులకు నిర్మిస్తున్న షెడ్ల విషయంలో జిల్లా పదవ స్థానంలో నిలిచింది. మొత్తం 1019 గోకులాలు మంజూరు కాగా అందులో 892 గోకులాల నిర్మాణం ప్రారంభమైంది. వాటిలో 22 మాత్రమే పూర్తయ్యాయి.

ఆధార్ లేని పిల్లలు 61 వేలు

జిల్లాలో ఆరేళ్ళ లోపు వయసున్న పిల్లలు 63,831 మందికి ఆధార్ కార్డులు లేవని ప్రభుత్వం గుర్తించింది. వీరి ఆధార్ నమోదుకు ప్రభుత్వం ఒత్తిడి పెంచగా ఇప్పటి వరకూ 2071 మంది పిల్లల వివరాలు నమోదు చేశారు. ఇంకా 61,760 మంది పిల్లల వివరాలు నమోదు కావాల్సి వుంది.



2.14 లక్షల మంది ఆధార్ డేటా మిస్

ఆధార్ డేటా బేస్ నుంచీ మిస్ అయిన వారి సంఖ్య రాష్ట్రంలో 50 లక్షలు వుండగా జిల్లాలో 2.21 లక్షల మంది వున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. ఇలా మిస్ అయినవారి సంఖ్య 2,21,648. వీరిలో 7609 మందివి డేటా బేస్‌లో చేర్చారు. మిగిలిన 214139 మంది వివరాలు ఇంకా పెండింగ్ వున్నాయి.

పర్యాటకమే అభివృద్ధికి ప్రధాన వనరు

- పులికాట్‌ను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలి
- రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి
- కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం



సీఎం కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టరు వెంకటేశ్వర్

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యాటక రంగమే అటు రాష్ట్రాభివృద్ధికి, ఇటు తిరుపతి జిల్లా అభివృద్ధికి ప్రధాన వనరని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. బుధవారం అమరావతిలో కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాపై సీఎం ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. జిల్లాకు సంబంధించి వివిధ రంగాల సమాచారాన్ని కలెక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పారిశ్రామిక రంగంలో మెరుగైన స్థితిలో ఉన్న జిల్లా.. తీర ప్రాంతం కారణంగా మరింత అభివృద్ధి చెందడంతో పాటు పర్యాటక రంగంలోనూ ప్రత్యేకతను సాధించే అవకాశం ఏర్పడిందన్నారు. పర్యాటకాభివృద్ధిలో భాగంగా పులికాట్ సరస్సులో పూడిరాయిదొరువు వద్ద పూడిపోయిన సముద్ర ముఖ ద్వారాలను తిరిగి తెరిపించాలన్నారు. దీనికి రూ. 97 కోట్లు కేటాయించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. దీంతో పాటు పులికాట్ సరస్సు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి పరచడం ద్వారా పారిశ్రామిక రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని సూచించారు. వివిధ జిల్లాల నుంచి రేషన్ బియ్యం తిరుపతి జిల్లా మీదుగానే తమిళనాడుకు అక్రమ రవాణా జరుగుతోందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.దీనిని అడ్డుకోవాలని.. అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని స్పష్టం చేశారు. అధికారులు, ఉద్యోగులకు కూడా కఠిన ఆదేశాలివ్వాలని సూచించారు. నెల రోజుల్లోపు రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. నామమాత్రంగా అర్జీలు తీసుకోవడం కాకుండా వాటి పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆర్డీవో స్థాయిలో అర్జీల పరిష్కారం జరిగిందా లేదా అన్నది పరిశీలించాలన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ కూడా తరచూ సమీక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో సంబంధిత సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో అభివృద్ధికి సంబంధించి పలు ప్రతిపాదనలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

రెవెన్యూ సదస్సులకు 652 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జేసీ శుభం బన్సల్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా బుధవారం 47 గ్రామసభలు నిర్వహించామన్నారు. భూకబ్జాలపై 12, రీసర్వేకు 21. 22ఏ కు 83, ఇంటి స్థలాలకు 98, అసైన్‌మెంట్‌ల్యాండ్‌కు 40, ఆర్‌వోఆర్‌కు 289, ఇతర విషయాలకు సంబంధించి 81 చొప్పున 652 అర్జీలు వచ్చాయన్నారు. వీటిలో 19 అర్జీల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించామని తెలిపారు.

వీళ్ల డేటా ఇవ్వండి

- టీడీఆర్ బాండ్ల లబ్ధిదారులపై సీఐడీ అనుమానం
- గొల్లవానిగుంట రోడ్డులోనే 32వాటికి డోర్ నెంబర్లు లేని వైనం
- మరో మూడు రోజులు ప్రత్యేక బృందాల విచారణ

తిరుపతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లపై సీఐడీ విజిలెన్స్ జరుపుతున్న విచారణలో భాగంగా పలువురు లబ్ధిదారులపై అనుమానం వ్యక్తం చేసింది. గొల్లవాని గుంట మాస్టర్ ప్లాన్ రోడ్డుకు సంబంధించి టీడీఆర్ బాండ్లు పొందినవారిలో 62 మంది వివరాలు కావాలని నగరపాలక సంస్థ అధికారులను సీఐడీ కోరింది. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లుగా పనిచేసిన పీఎస్ గిరీష మంజూరు చేసిన 34 బాండ్లు, అదే విధంగా 16 బాండ్లు, 12 బాండ్లు చొప్పున అనుపమ అంజలి, హరిత ఆమోదించిన వివరాల జాబితాపై సీఐడీ దృష్టిపెట్టింది. వీటిలో 32 మంది లబ్ధిదారులకు వారి డోర్ నెంబర్లు కానీ, సమీప డోర్ నెంబర్లు కానీ సదరు జాబితాలో లేకపోవడంపై అధికారులు తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. డోర్ నెంబరు ఉన్నవాటికి పన్నులు వేశారా? వేసుంటే ఎంత విస్తీర్ణానికి ఎంత వేశారు? అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం.

50 శాతం పూర్తయిన ఇంటింటి విచారణ

టీడీఆర్ బాండ్ల క్షేత్ర స్థాయి విచారణకోసం వివిధ ప్రాంతాలనుంచి తిరుపతికి చేరుకున్న పది మంది అధికారుల బృందం మరో మూడు రోజుల పాటు మాస్టర్ ప్లాన్ రోడ్ల వెంబడి తిరగాల్సి ఉంది. గత మూడు రోజులుగా చేపట్టిన విచారణ 50 శాతం పూర్తయినట్టు తెలిసింది. విచారణలో భాగంగా ప్రతి టీడీఆర్ బాండు లబ్ధిదారుకు సంబంధించి 56 అంశాలపై వివరాణాత్మకంగా నివేదిక సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

చంద్రగిరి

రెవెన్యూ సదస్సుకు 12 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామాంజులునాయక్

తిరుపతిరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 12 ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దార్ రామాంజులునాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సర్వే నంబరు 305లో 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తన భూమిని (2.5ఎకరాలు) ల్యాండ్ అక్విజిషన్ కింద జగనన్న హౌసింగ్ కాలనీ(డి-శేటగిరి)కి తీసుకుని పరిహారం ఇవ్వలేదని హరిజనవాడకు చెందిన లక్ష్మి, వెంకటేశ్ దంపతులు వాపోయారు. గ్రామానికి చెందిన శ్రీరాముల గుడి తరఫున 1971లో అప్పటి పూజారి, ధర్మకర్త ఉమ్మిడి సుబ్బయ్య పేరిట సర్వే నెంబరు 312/3లో రెండెకరాల భూమిని డీకేటీ పట్టా మంజూరు చేశారని, సదరు భూమి ఆన్‌లైన్ రికార్డులో శ్రీరాముల భజన మందిరం ట్రస్టీ పేరిట నమోదై ఉందని, దీన్ని జగనన్న హౌసింగ్ కాలనీకి తీసుకుని పరిహారం ఇవ్వలేదని గ్రామస్తులు విన్నవించారు. కాగా పలువురు అర్జీలను అందించారు. టీడీపీ నేతలు ఊరిబిండి మునిశేఖర్, మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్వో సుధాకర్‌రాజు, కార్యదర్శి పాల్గొన్నారు.

మూగజీవాలకు ఆహారంగా చెత్త, వ్యర్థాలు



రహదారి పక్కన పడేసిన చెత్తను తింటున్న ఆవులు

తిరుపతి రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో జాతీయ రహదారికి ఆనుకుని పలుచోట్ల చెత్త, వ్యర్థాలను పడేసి వెళుతున్నారు. అటువైపుగా వెళ్లే మూగజీవాలు ప్లాస్టిక్‌తో పాటు కుళ్లిన వ్యర్థాలను తిని, అనారోగ్యం పాలవుతున్నాయి. గాంధీపురం పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిలో పడేసిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను అక్కడ సంచరించే ఆవుల మంద తింటున్న దృశ్యం బుధవారం ఉదయం కనిపించింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీస్థలంలో చెత్తవేస్తే అపరాధం వేస్తామని అధికారులు హెచ్చరించినా కొందరు గుట్టుచప్పుడుకాకుండా డంప్ చేసి వెళుతున్నారు. అవిలాల సర్కిల్ నుంచి సి.మల్లవరం కూడలి వరకు ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది.

సీఎస్ఐ చర్చిలో మెడిటేషన్ భవనం ప్రారంభం



మెడిటేషన్ భవనాన్ని ప్రారంభిస్తున్న షర్మ నిత్యానందం

పాకాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాకాల సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చి ఆవరణలో నూతనంగా నిర్మించిన మెడిటేషన్ భవనాన్ని బుధవారం దక్షిణ ఇండియా సంఘం వేలూరు అధ్యక్ష మండలం బిషప్ రైట్ రెవరెండ్ హెచ్.షర్మ నిత్యానందం ప్రారంభించారు. దైవారాధనకు, సామూహిక బైబిల్ పఠనానికి, ప్రార్థనలకు, స్త్రీల మైత్రి సంఘం సమావేశాలకు స్థానిక క్రైస్తవులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం రైల్వేస్టేషన్ ఎదుట సీఎస్ఐ చర్చికి నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీ ఛైర్మన్ రెవరెండ్ ఐ.జయకరన్, రెవరెండ్ ప్రేమ్‌కుమార్, సంఘ కార్యదర్శి విక్టర్ ఎం.రాఘవేలు, ట్రెజరర్ జి.అరుళ్ సెల్వి పాల్గొన్నారు.

భాషలతో జాతీయ సమైక్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మొహిద్దీన్ బాషా

పాకాల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భాషలను గౌరవించుకోవడం ద్వారా జాతీయ సమైక్యత సాధించవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహిద్దీన్ బాషా అన్నారు. మహాకవి సుబ్రమణ్యభారతి జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు విభాగం ఆధ్వర్యంలో భారతీయ భాష ఉత్సవం నిర్వహించారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు) ఆధ్వర్యంలో తెలుగుభాష విశిష్టతపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరబాబు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, అధ్యాపకులు మాశిలామణి, చిట్టి కళావతి, మోహన్ బెహర పాల్గొన్నారు.

ఐతేపల్లెలో వైభవంగా గంగమ్మ జాతర



ఐతేపల్లెలో జాతరకు విచ్చేసిన సుధారెడ్డి

చంద్రగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఐతేపల్లెలో బుధవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి గ్రామ సమీపంలోని స్వర్ణముఖి నదిలో బంకమట్టితో నడివీధి గంగమ్మ ప్రతిమను తయారు చేశారు. విశేషంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఉదయం గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మ జాతర సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఏవీ రమణమూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు సరిత, ఎంపీటీసీ ఏసీ శేఖర్ ఎమ్మెల్యే పులివర్తి నాని, సతీమణి పులివర్తి సుధారెడ్డితో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నాయకులను, స్నేహితులను ఆహ్వానించారు. దీతో బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులు గంగమ్మను దర్శించుకున్నారు. వీరితో పాటు టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు రమేష్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, బాలకృష్ణమూర్తి, లోకాద్రినాయుడు, కొటాల సుధా, గౌస్‌బాషా ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికి వేదిక



మామండూరులో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ శివరామసుబ్బయ్య

చంద్రగిరి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కార వేదికే రెవెన్యూ సదస్సు అని తహసీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. చంద్రగిరి మండలం మామండూరు, కొటాలలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో ఆయన మాట్లాడారు. భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాలు చుట్టూ తిరగకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బుధవారం సదస్సులో 47 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఆర్‌వోఆర్, మ్యూటేషన్, సర్వే, రేషన్ కార్డులు, ఆన్‌లైన్‌లో మార్పులు, చేర్పులు తదితర సమస్యలపై ఎక్కువ అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. సర్పంచులు షేక్ ఫజిల్లా, గంగులమ్మ, ఎంపీటీసీలు ఏసీ శేఖర్, మధు, సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రావిళ్లవారిపల్లెలో..

రామచంద్రాపురం, ఆంధ్రజ్యోతి: రామచంద్రాపురం మండలం రావిళ్లవారిపల్లెలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. వివిధ సమస్యలకు సంబంధించి 30 వినతులు వచ్చాయి. స్పెషలాఫీసర్ చంద్రశేఖర్, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నీలకంఠ చౌదరి, తహసీల్దారు వెంకటరమణ, డీటీ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో చతుర్వి ప్రతిభ

భాకరాపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన భగవద్గీత పోటీల్లో చిన్నగొట్టిగల్లు మండలం కొమ్మిశెట్టివారిపల్లె పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న చరుర్వి ప్రతిభ కనబరిచింది. దుర్గసముద్రంలో జరిగిన జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన ఆ చిన్నారిని హెచ్ఎం విజయ అభినందించారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విశేషాలంకరణలో గంగమ్మ

భాకరాపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చినిగేపల్లెలో కట్ట కింద గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున విగ్రహ ప్రతిష్ఠ యంత్ర స్థాపన, నాడీ సంధానం, స్పర్శ ఆహుతి కాలన్యాసం, మహా పూర్ణాహుతి, కుంభజల సంప్రోక్షణ అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

గొల్లపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్ అన్యాయం

తిరుపతిరూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి రూరల్ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో సి.గొల్లపల్లె గ్రామంలో అవకతకవలు జరిగాయన్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో కమిటీ ద్వారా విచారణ నిర్వహించకుండానే ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవిని సస్పెండ్ చేశారని, ఇది చాలా అన్యాయమని రూరల్ ఎంపీపీ యశోద పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించకుండా గ్రామానికి చెందిన టీడీపీ నేత ఫిర్యాదు మేరకు అధికారులు ఆమెను అన్యాయంగా సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాగా, సామాజిక వేదిక బహిరంగ సభా వేదికపై ఎంపీపీ సమక్షంలోనే ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ జరిగినప్పుడు మాట్లాడకుండా ఒకరోజు గడిచాక విమర్శలు చేయడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎంపీపీ వెనుక ఎవరో ఉండి మాట్లాడించారన్న చర్చ నడుస్తోంది.









రుయాలో రోగులు గజగజ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి తేలిక పాటి వర్షం కురిసింది. ఈ చిన్నపాటి చినుకులకే రుయాస్పత్రిలోని రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడ్డారు. చలిగాలి వీస్తుండటంతో ఆస్పత్రి పరిసరాల్లో, రోడ్లపై ఆశ్రయం పొందుతూ చలికి వణికిపోయారు. సాయంత్రం నాలుగు గంటలకే కపిలతీర్థం నుంచి అలిపిరి, జూపార్కు వెళ్లే మార్గాల్లో మంచు కమ్మేయడంతో వాహనదారులు కొంత ఇబ్బందిపడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక అవస్థలు పడాల్సి వచ్చింది. ప్రకృతి ప్రేమికులు మాత్రం ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు. సెల్ఫీలు దిగుతూ సంతోషంగా గడిపారు.

బ్రాహ్మణపట్టులో ఇళ్లు, షాపుల కూల్చివేత



తిరుచానూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం బ్రహ్మణపట్టు గ్రామంలో ఆరు దుకాణాలు, రెండు ఇళ్లను టీటీడీ ఎస్టేట్ విభాగం తహసీల్దారు లలితాంజలి నేతృత్వంలో అధికారులు బుధవారం వేకువజామున కూల్చివేశారు. టీటీడీ స్థలంలో అక్రమంగా నిర్మించిన ఉన్న ఆరు దుకాణాలు, రెండు ఇళ్లను కూల్చివేసినట్లు ఆమె తెలిపారు. ఆరు నెలలుగా హెచ్చరిస్తున్నా, నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదని చెప్పారు. అయితే బాధితులు మాత్రం తమకు ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేశారని అంటున్నారు.

పేదలపై టీటీడీ ప్రతాపం సిగ్గుచేటు

టీటీడీ పేదల ఇళ్లు కూల్చివేయడం దుర్మార్గమని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి అన్నారు. బుధవారం బ్రహ్మణపట్టులో టీటీడీ అధికారులు కూల్చివేసిన ఇళ్లను ఆయన పరిశీలించారు. 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న నాలుగు పేద కుటుంబాల ఇళ్లను టీటీడీ అధికారులు దౌర్జన్యంగా కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. 25 ఏళ్ల తర్వాత టీటీడీకి అది తమ స్థలమని గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో పోరాటాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

రూ.5 కోట్లతో భాకరాపేట- ఎల్లమంద రోడ్డు విస్తరణ

● పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే నాని



ఎర్రావారిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భాకరాపేట- ఎల్లమంద రోడ్డుకు రూ.5 కోట్లతో చేపట్ట విస్తరణ పనులను బుధవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ఈ రోడ్డు నుంచి ఇటీవల అన్నమయ్య జిల్లా సుండుపల్లె, రాయచోటి మీదుగా కడపకు వాహనాల రాకపోకలు పెరిగాయి. దీనికితోడు ఈ రోడ్డు చాలా చోట్ల వంపులు, మలుపులతో కూడుకొని ఉండడంతో ప్రయాణ సమయం చాలా పట్టుతోంది. తనను గెలిపిస్తే రోడ్డు విస్తరణ పనులను చేపడతానని ఎన్నికల సమయంలో పులివర్తి నాని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఈ రోడ్డు పనులకు ఆయన రూ.5 కోట్లు మంజూరు చేయించారు. ఈ పనులను బుధవారం ప్రారంభించారు. ఎన్నికల హామీని నిలబెట్టుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయశంకరస్వామి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో అన్నమయ్య గృహాన్ని పునర్నిర్మించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి డిమాండు చేశారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం వద్ద బుధవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తిరుమలలో అన్నమయ్య, హనుమంతుడి విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో హరినామ సంకీర్తన కోసం నమోదు చేసుకున్న 7 వేల బృందాలకు అవకాశం కల్పించాలని కోరారు. శ్రీవారి వైభవాన్ని తన సంకీర్తనలతో అన్నమయ్య విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. అన్నమయ్య ప్రాభవాన్ని తగ్గించేలా 2003 లో తిరుమలలో అన్నమయ్య గృహాన్ని కూల్చి వేశారనీ, ఇది భక్తుల మనోభావాలను గాయపరిచిందన్నారు. ఏం పాపం చేశారని 2007లో అన్నమయ్య, హనుమంతుడి విగ్రహాలను తొలిగించారని ప్రశ్నించారు. వీటిపై టీటీడీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా ఇంతవరకూ పట్టించుకోలేదని తెలిపారు. జానపద గురువులకు కనీస వేతనం రూ. 10 వేలు ఇవ్వాలన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా హరినామ సంకీర్తన నిర్వహించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకపోతే ఫిబ్రవరి 22 వ తేదీన ఉపవాస హరినామ సంకీర్తన నిరసన కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించారు. వీటిపై జేఈవో వీరబ్రహ్మంకు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు బీటీఆర్ కాలనీ నుంచీ టీటీడీ ఏడీ బిల్డింగ్ వరకూ శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య కళా క్షేత్రం కార్యదర్శి వెంకటయ్య, జానపద కళాకారుల సంఘం కార్యదర్శి మురళి, కోశాధికారి దేవానంద్, జైభారత్ కార్యదర్శి లోకనాథం, పరశురాం, సుధాకర్, సుమతి, దామోదరనాయుడు, కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

సంబరాల జాతర

శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏడుగంగమ్మల జాతర సంబరాలతో శ్రీకాళ హస్తి పట్టణం బుధవారం సందడిగా మా రింది. పట్టణంలో ఎక్కడ చూసినా జనసందడి కనిపించింది. దీంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ మళ్లించారు. పట్టణంలోని మొదటి గంగమ్మ పొన్నాలమ్మ అమ్మవారు పెండ్లిమండపం వద్ద కొలువుదీరారు. వెండి కవచాలంకృతమై అమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇక రెండో అమ్మ వారు ముత్యాలమ్మ బేరివారిమండపం వద్ద దర్శనమిచ్చారు. మూడో అమ్మవారు అంకాళమ్మ సన్నిధివీధి రాజగోపురం పక్కన కొలువు దీరి వెండి ఆభరణాల అలంకారంలో భక్తులను కటాక్షించారు. నాలుగో అమ్మవారు నల్లగంగమ్మ బ్రా హ్మణవీధిలో, ఐదో అమ్మవారు కావమ్మ పూసల వీధిలో, ఆరో అమ్మవారు అంకమ్మ గాంధీ వీధిలో కొలువై విశేష అలంకారాల్లో దర్శన మిచ్చారు. ఏడవ అమ్మవారు భువనేశ్వరి కొత్త పేటలో ఊంజలసేవ అలంకారంలో దర్శనమిచ్చారు.

వేషాలు.. బలులు.. అంబళ్లు

జాతర సందర్భంగా అమ్మవార్లకు కుంభం, కోడిపుంజులు, వేటలు సమర్పించారు. పలువురు అంబలి సమర్పించి వితరణ చేశారు. పెండ్లిమం డపం వరకు ఏడుగురు అమ్మవార్లు ఊరేగింపుగా వచ్చారు. అక్కడి నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడకు వెళ్లి కొలువుదీరారు. పట్టణమంతా రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది. కొందరు భక్తులు 108 కొబ్బరికాయలను కూడా కొట్టి మొక్కు తీర్చుకున్నారు. మరికొందరు వివిధ వేషధారణలతో సందడి చేశారు. మహిళలు, పిల్లలు వేపమండలను చీరలుగా ధరించి వెయ్యికళ్ల దుత్తలను సమర్పించారు.

జాతర ప్రశాంతం

జాతర అత్యంత ప్రశాంతంగా ముగిసింది. యేటా జాతరలో మద్యం మత్తులో చెదరు మ దురు ఘటనలు, చిన్న చిన్న ఘర్షణలు జరిగేవి. ఒక్కోసారి పెద్దగొడవలు తోపులాటలకు దారి తీసేవి. ఈ యేడాది పాత గంగమ్మ కమిటీలను మార్చి ఈ సారి కొత్త కమిటీలను ఆయా గంగమ్మల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో శ్రీకాళహస్తిలో నెల రోజుల ముందే జాతర చందాల సేకరణ నుంచే వర్గపోరు తెరమీదకు వచ్చింది. దీంతో ఎక్కడ రాజకీయ రగడకు జాతర వేదిక అవుతుందోనన్న తీవ్ర ఆందోళన అధికారుల్లో మొదలైంది. ఎస్పీ సుబ్బరాయుడు జాతర పర్యవేక్షణపై అధికారులను ఎప్పటికప్పుడు ఆరా తీశారు. ఏఎస్పీ రవి మనోహరాచారి శ్రీకాళహస్తికి చేరుకుని స్వయంగా బందోబస్తును కసరత్తు చేశారు. ఎక్కడా సమస్య ఉత్పన్నం కాకుండా పగడ్బందీగా పోలీసు యంత్రాంగం ముందు నుంచే అడుగులు వేసింది.

పేద విద్యార్థులకు .... దన్నుగా ప్రభుత్వం

● చిత్తూరు,తిరుపతి జిల్లాల్లో
101 వసతి గృహాలకు రూ.15.17కోట్ల మంజూరు



ఓ హాస్టల్లో పాడైపోయిన కిటికీలపై దుస్తులను ఆరేసుకున్న విద్యార్థులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది.ఐదేళ్ల వైసీపీ పాలనలో వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో పెచ్చులూడిన పైకప్పులు, శిథిలమైన మరుగుదొడ్లు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, రెక్కలు విరిగిన ఫ్యాన్లు, నీళ్లు కారుతున్న గదుల్లోనే విద్యార్థులు బస చేయాల్సి వచ్చింది.చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న తొలి నాళ్లలోనే వసతి గృహాల మరమ్మతులపై దృష్టిసారించారు. విద్యార్థులకు ఏమి అవసరమో గుర్తించి ఒకటికి రెండుసార్లు నివేదికలు తెప్పించుకుని ప్రభుత్వానికి పంపారు.ఈ నేపథ్యంలో వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.చిత్తూరు జిల్లా పరిధిలో 46 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.04 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.109.83 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్‌కు రూ.114.75 లక్షలు, కిటికీలకు మెష్‌ల ఏర్పాటుకు రూ.66.15 లక్షలు, డోర్లు, విండోల మరమ్మతులకు రూ.44.27 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.94.67లక్షలు, ఫ్లోరింగ్‌కు రూ.70.38 లక్షలు, ప్రహరీ నిర్మాణాలకు రూ.91.83లక్షలు, ఇతర పనుల కోసం రూ.205.71 లక్షలు కేటాయించారు.తిరుపతి జిల్లాకు సంబంధించి మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.122.71 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.82.11 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్ కోసం రూ.81.24లక్షలు, మెష్‌ల ఏర్పాటుకు రూ.46.80 లక్షలు, డోర్లు, విండోల కోసం రూ.67.92 లక్షలు, అవసరమైన ఇతర పనుల కోసం రూ.83.82 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.78.63 లక్షలు, ఫ్లోరింగ్ కోసం రూ.63.50 లక్షలు, ప్రహరీ నిర్మాణాల కోసం రూ.7.30 లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ పనులను చేపట్టి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసింది.

ఘనంగా గీతా జయంతి



ప్రత్యేక అలంకారంలో రాధాకృష్ణులు

రామచంద్రాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట శ్రీశక్తిపీఠంలో బుధవారం గీతా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిభక్తులకు అనుగ్రహ బాషణం చేశారు.

ఎల్లమందలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ

ఎర్రావారిపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద పంచాయతీలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నానీ ప్రారంభించారు. మారుమూల ప్రాంత ప్రజలకు గ్యాస్ ఏజెన్సీ అందుబాటులోకి రావడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, పుంగనూర్ టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు, ఏజెన్సీ నిర్వాహకుడు జగదీష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బొమ్మన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

25 వాహనాలకు రూ.35 వేల జరిమానా

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): సరైన పత్రాలు లేకుండా తిరుమలలో తిరుగుతున్న 25 ట్యాక్సీలకు ట్రాఫిక్ పోలీసులు రూ.35 వేల జరిమాన విధించారు. ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, ఎస్ఐలు రామచంద్రానాయక్, గౌరీశంకర్ తిరుమలలోని ఎస్ఎంసీ, యాత్రికుల వసతి సముదాయం3 వద్ద బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ట్యాక్సీలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకూడదని, డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఆదేశించారు.

రేపు తిరుమంగై ఆళ్వార్ సాత్తుమొర

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం తిరుమంగై ఆళ్వార్ సాత్తుమొర నిర్వహించనున్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి ఆలయంలో ఈ ఉత్సవం జరుగుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి, తిరుమంగై ఆళ్వార్ ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారు. ఆళ్వారుల పరంపరలో ఆఖరివాడైన తిరుమంగై ఆళ్వార్‌ను శ్రీవారి ధనస్సు అయిన సారంగి అంశ అంటారు.

జాతరలో బాలుడికి గాయాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏడు గంగమ్మల జాతరలో ఓ బాలుడు(15) గాయపడ్డాడు. ఎందుకు, ఎలా గాయపడ్డాడు అన్న విషయాన్ని బాలుడి కుటుంబసభ్యులు వెల్లడించేందుకు నిరాకరించారు. శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన విద్యార్థి స్నేహితులతో కలిసి మంగళవారం రాత్రి జాతర వేడుకల్లో పాల్గొన్నాడు. ఏడుగంగమ్మల ఆల యం గంగమ్మ చప్పరం పక్కన నిలబడుకుని ఉండగా మెడకు గాయమైందంటూ ఆ బా లుడు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రాత్రి 2గంటల సమయంలో చేరాడు. కాసేపటికి కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని తమ బిడ్డను ఇంటికి తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి వివరాలను వారు వెల్లడించలేదు. అలాగే పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నేనూ ట్రాఫిక్ సిగ్నల్ పాటిస్తా

తిరుపతిలోని చేపలమార్కెట్ నుంచి లీలా మహల్‌వైపు వచ్చే దారిలో బుధవారం రెడ్ సిగ్నల్ పడింది. వాహనదారులంతా ఆగారు. అదే దారిలో వస్తున్న ఓ ఆవు కూడా వాహనదారులను అనుసరిస్తూ అలాగే నిలబడింది. గ్రీన్ సిగ్నల్ పడ్డాక వాహనాలతో పాటు ఆవు కూడా ముందుకు కదిలింది. నేనూ ట్రాఫిక్ రూల్స్ పాటించి.. సిగ్నల్స్ అనుసరిస్తానన్నట్లుగా ఈ ఆవు ప్రవర్తించిన తీరు అక్కడివారిని ఆకట్టుకుంది.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి



వాహనాలతో పాటు ఆగిన ఆవు



ఇలా వంచి, విరిచి.. ఎంచక్కా సంచులో వేసుకుంటూ..

డివైడర్ల గ్రిల్‌నూ వదల్లేదు

వెనుక గోతాం వేసుకుని రోడ్లపై ప్లాస్టిక్ బాటిళ్లు, నిరుపయోగ వస్తువులు, కవర్లు, ఫర్నిచర్ ఏరుకుని కొందరు జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిలో కొందరు తిరుపతి నగరం తిరుమల బైపాస్ రోడ్డులో గరుడ వారధి కింద డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్‌నూ లాక్కెళుతున్నారు. కొన్నిచోట్ల ఈ గ్రిల్ తుప్పు పట్టి.. దెబ్బతింది. ఆ కమ్మీలను విరిచి తీసుకెళుతున్నారు. ఇలా 10 రోజులుగా చేస్తున్నారు. బుధవారం పగటిపూటే ఓ వ్యక్తి ఇనుప గ్రిల్ తొలగించి.. తీసుకెళుతుండటం 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ కంటపడింది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

సంతగేటు వద్ద నివాస గృహాల తొలగింపు



గేటు వద్ద నివాస గృహాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి (ఆటోనగర్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట సంత గేటు వద్ద జరుగుతున్న చెన్నై-తిరుపతి బైపాస్ రైలు మార్గం పనులకు అడ్డుగా ఉన్న 53 నివాస గృహాలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. ఈ ఇళ్ల కారణంగా రైల్వే మార్గం పనులకు ఆటంకం కలుగుతున్న విషయమై ఆంధ్రజ్యోతిలో వార్తలు ప్రచురితమైన విషయం విదితమే. వాటిపై స్పందించిన రెవెన్యూ అధికారులు నివాసితులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించింది. రూ.22 కోట్లతో చేపడుతున్న ఈ పనులకు భూసేకరణలో సంతగేటు సమీపంలోని నక్కలకాలనీ, గాంధీనగర్‌లలోని 53 నివాసగృహాల యజమానులు ఖాళీ చేయడానికి ససేమిరా అన్నారు. దీంతో పనులు ఆలస్యమవుతూ వచ్చాయి. సమస్య పరిష్కారం కావడంతో పనులు వేగం పుంజుకోనున్నాయి.

ఆర్‌హెచ్‌వీఎస్ మహిళా విభాగ అధ్యక్షురాలిగా శ్రీదేవి

తిరుపతి(జీవకోన), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన్ (ఆర్‌హెచ్‌వీఎస్) రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా తిరుపతికి చెందిన రుద్రరాజు శ్రీదేవి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా రిటైర్డ్ ఆర్మీ సిరిగిరి శంకర్‌రాజులను నియమించినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి సుకుమార్‌రాజు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారికి సుకుమార్‌రాజు చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో తిరుపతి నుంచి శ్రీరామ రథయాత్ర ప్రారంభం కానుందని, ఆ యాత్ర అయోధ్య వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ మహాయజ్ఞంలో తనకు భాగస్వామ్యం కలగడం దైవసంకల్పంగా భావిస్తున్నట్లు తెలిపారు.

భగవద్గీతపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎస్ కాలేజీలో భగవద్గీతపై బుధవారం వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలుగు, సంస్కృత విభాగాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ప్రిన్సిపాల్ సత్యనారాయణ బహుమతులు అందజేసి అభినందించారు.

హక్కుల రక్షణకు మహిళలు పోరాడాలి



ర్యాలీలో పాల్గొన్న సాయిలక్ష్మి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన హక్కుల అమలు కోసం మహిళలు పోరాటం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి కోరారు. ఎస్వీ వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన హక్కుల దినోత్సవ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. నేటికీ మహిళలపై హింస, అణచివేత తీవ్రంగా కొనసాగుతోందన్నారు. చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, జిల్లా నాయకురాలు పౌర్ణమి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, నాయకులు చినబాబు, వరలక్ష్మి, నాగరత్నమ్మ, జయలక్ష్మి, నందిని, రామరాజ్యం, శకుంతలమ్మ పాల్గొన్నారు.

ఓఆర్ఐ జర్నల్ విడుదల



జర్నల్‌ను విడుదల చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఓఆర్ఐ నిర్వహించే జర్నల్‌ను వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఓఆర్ఐ డైరెక్టర్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఓఆర్ఐ 64వ త్రిభాషా జర్నల్‌ను వెలువరించడం గొప్ప విషయమన్నారు. ప్రాచీన గ్రంథాల పరిరక్షణ, పరిష్కరణ, డిజిటలైజేషన్ ద్వారా ప్రాచీన వారసత్వ సంపదను కాపాడటానికి ఓఆర్ఐ ఎంతో కృషి చేస్తోందన్నారు. టీటీడీ సహకారంతో ఓఆర్ఐని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.

వేదాంత దేశికుల ఆలయ మిరాశీదారు వాసుదేవన్ కన్నుమూత



వాసుదేవన్ (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని గోవిందరాజస్వామి సన్నిధి వీధికి చెందిన వేదాంత దేశికుల ఆలయ మిరాశీదారు కళత్తూరు వాసుదేవన్ కన్నుమూశారు. బుధవారం సాయంత్రం స్విమ్స్‌లో గుండెపోటుతో మృతి చెందారు. బీకాం, బీఎల్ పట్టా పొందిన ఈయన ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగ విరమణ చేశారు. టీటీడీ ఆలయ సంప్రదాయ, ఆచార వ్యవహారాలు క్షుణ్ణంగా తెలిసిన ఈయన 25 ఏళ్ల పాటు దేశికుల సన్నిధిలో కైంకర్యం చేశారు. ఆచార్యుని కైంకర్యం కోసం వివాహం చేసుకోలేదు. ప్రతి రోజూ కట్టెల పొయ్యిలోనే ప్రసాదాలు తయారు చేసి నైవేద్యం సమర్పించేవారు. వాసుదేవన్ మృతి శ్రీవైష్ణవ సంప్రదాయానికి తీరని లోటని స్థానిక అర్చకులు, జీయంగార్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం గంగుండ్ర మండపం వీధిలోని వీరి నివాసంలో భౌతికకాయాన్ని ఉంచుతారు. అనంతరం అక్కారంపల్లె మార్గంలోని గోవిందధామంలో దహన క్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు.

వ్యాపారులకు దుప్పట్ల అప్పగింత

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఊరూరా తిరుగుతూ ప్లాస్టిక్ పాత్రలు, చలి దుప్పట్లు అమ్ముకునే వారిపై మంగళవారం ట్రాఫిక్ పోలీసులు జులుం ప్రదర్శించారు. దుప్పట్లు, ప్లాస్టిక్ పాత్రలు తీసుకుని వెళ్లారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దీనిపై ఆంధ్రజ్యోతిలో బుధవారం 'ఇదేమీ పోలీసు జులుం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎస్పీ సుబ్బరాయుడు విచారణ జరిపి, ట్రాఫిక్ పోలీసులు బలవంతంగా తీసుకొచ్చిన చలి దుప్పట్లు, ఇతర వస్తువులను వెంటనే వారికి అప్పగించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి దుప్పట్లు, ప్లాస్టిక్ పాత్రలను బాధితులకు అప్పగించారు.

గోమాతకు రక్షణేదీ?

మేత కోసం రోడ్లపై సంచారం - ప్రమాదాల్లో మృత్యువాత

నిర్లక్ష్యంగా యజమానులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీధుల్లో సంచరిస్తున్న ఆవుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతోంది. యజమానులు నిర్లక్ష్యంగా వాటిని వదిలేస్తుండడం, అవి రోడ్లపై సంచరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తద్వారా వాహనదారులతో పాటు అవి కూడా ప్రాణాలు పోగొట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మంగళవారం సాయంత్రం కరకంబాడీ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక ఆవు ప్రాణాలు కోల్పోయింది. దీనికి గోవు యజమానే బాధ్యత వహించాలని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో దాదాపు వెయ్యి ఆవులు ఉన్నట్లు తెలుస్తోంది. యజమానులు ఉదయం పాలు తీయడమే ఆలస్యం రోడ్లపైకి తోలేస్తున్నారు. గడ్డి పెట్టడం లేదు. దీంతో అవి రోడ్లపై తచ్చాడుతూ చెత్తాచెదారం తింటున్నాయి. డివైడర్లపై పచ్చికను మేస్తున్నాయి. ఈ రెండు లభించని పక్షంలో హోటల్స్, ఇళ్ల వద్దకు వెళ్లి వారు ఇచ్చే పండో ఫలమో తింటున్నాయి. ఏదోక రూపంలో ఆకలి తీర్చుకుని రోడ్డుకు అడ్డుగా సేదతీరుతాయి. తద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంటోంది. కొన్ని వాహనాలు అదుపుతప్పి గోవులమీదకు దూసుకెళుతున్నాయి. గాయాలతో పాటు ప్రాణాలు కోల్పోతున్నాయి. కరకంబాడీ రోడ్డు విశాలంగా ఉండడంతో పెద్ద పెద్ద వాహనాలు వేగంగా నడుస్తుంటాయి. రోడ్డు దాటుతున్న సమయంలో వాహనాలు అదుపుతప్పి గోవులను ఢీకొంటున్నాయి. ఇకనైనా యజమానులు గోవుల రక్షణలో పూర్తిగా బాధ్యత తీసుకోవాలని, ఆ దిశగా నగరపాలక సంస్థ, పోలీసు విభాగం చర్యలు చేపట్టాలని నగర వాసులు కోరుతున్నారు.





రోడ్లపై సేదతీరుతున్న ఆవులు

యూనియన్‌కు ఒక దుకాణం కేటాయించాలి

రుయాలో యూనియన్ నేతల తీరుపై సర్వత్రా విస్మయం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా ఉద్యోగ సంఘాల నేతలు ఉద్యోగుల సమస్యలు, వారి హక్కుల కోసం ఉద్యమాలు, పోరాటాలు చేస్తుంటారు. అయితే ఇందుకు భిన్నంగా రుయాలో దుకాణాలు, క్యాంటీన్ల కోసం యూనియన్ నేతలు పోరాటాలు చేయడం విమర్శలకు తావిస్తోంది. రుయాస్పత్రి పరిధిలోని 12 దుకాణాల టెండరుకు మూడు రోజుల కిందట అధికారులు నోటీసు విడుదల చేశారు. నిబంధనల మేరకు ప్రభుత్వాస్పత్రి పరిధిలోనే కాదు ఏ శాఖలోనూ ఉద్యోగ సంఘాలకు ప్రత్యేక గదులు, దుకాణాలు కేటాయించకూడదని స్పష్టమైన జీవో ఉంది. గతంలో ఈ నిబంధనలను తుంగలో తొక్కి ఆస్పత్రి పరిపాలనా భవనం లోపల ఏ-క్లాస్ వార్డు వద్ద ఓ చిన్నపాటి క్యాంటీన్‌ను నర్సింగ్ అసోసియేషన్‌కు కేటాయించారు. అసోసియేషన్ వారు దాన్ని బయటి వ్యక్తులకు అప్పగించడంతో హోటల్‌గా మార్చేసి అక్కడే వంటలు చేయడం ప్రారంభించారు. అంతేగాక ఆ క్యాంటీన్ నుంచి వచ్చే ఆదాయాన్ని దుర్వినియోగం చేశారంటూ నర్సింగ్ అసోసియేషన్ సభ్యుల మధ్య జరిగిన గొడవ చర్చనీయాంశంగా మారింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు యూనియన్లకు దుకాణాలు కేటాయించేందుకు వెనుకాడుతున్నారు. కానీ ఏపీ హంస, నర్సింగ్ అసోసియేషన్, ఏపీఎన్జీవో సంఘాల నేతలు మాత్రం ఒక్కో యూనియన్‌కు ఒక్కో దుకాణం కేటాయించాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. లేకపోతే ఆందోళన చేయాల్సి వస్తుందని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రెండు యూనియన్‌లు కలెక్టరును కలిసి వినతిపత్రం అందించాయి. ఉద్యోగ సంఘాలు రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు, ఆస్పత్రి అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల కోసం వినతులు ఇస్తే బాగుంటుందని, ఇలా వ్యాపారాల కోసం పోటీపడడం ఏమిటని కలెక్టర్ వారికి హితబోధ చేసినట్లు సమాచారం. ఇదే విషయమై పలువురు అధికారులు కూడా ఉద్యోగ సంఘాల నేతలపై మండిపడుతున్నారు.

అద్దె బకాయిలు ఏమైనట్లు?

గతంలో రుయాస్పత్రిలోని దుకాణాల నిర్వాహకులు రూ.20 లక్షలకు పైగా అద్దె బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ విషయమై గత ఏడాది పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు దుకాణాలను సీజ్ చేశారు కానీ ఇంతవరకు వారి నుంచి అద్దె మాత్రం వసూలు చేయలేదు. అద్దె చెల్లించని వారిపై కేసులు పెట్టామని చెబుతున్నారు తప్పా అటు దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.



రుయాస్పత్రిలోని దుకాణాలు

22ఏ నుంచి వెసులుబాటు కల్పించండి



రెవెన్యూ సదస్సుల్లో వినతిపత్రం స్వీకరిస్తున్న అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి

తిరుపతి(జీవకోన), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 22ఏ నుంచి తమ కాలనీలకు వెసులుబాటు కల్పించాలని అక్కారంపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు విన్నవించుకున్నారు. జడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో 87 వినతులు అందగా అత్యధికం 22ఏకు సంబంధించే ఉన్నాయి. అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి అర్జీలు స్వీకరించారు. 22ఏ నుంచి విముక్తి కల్పించాలని సుభాష్‌నగర్, టి.నగర్ (త్యాగరాజు నగర్), ఎస్టీ రోడ్డు, రామచంద్రనగర్, ద్వారకనగర్, శంకర్‌కాలనీ, అక్కారంపల్లె సమీపంలోని కొన్ని కాలనీల వాసులు కోరారు. కైకాల చెరువుకు సంబంధించిన భూ సమస్య పరిష్కరించాలని అర్జీదారులు కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రయ్య, ఆర్ఐ కృష్ణమ్మ, తిరుపతి టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ, పార్లమెంటరీ అధ్యక్షుడు నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు ముగిసిన శిక్షణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన వైద్య విధానాలపై ఎస్వీ వైద్య కళాశాలలో మూడు రోజులుగా వైద్య అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య విద్యలో నూతన అధ్యయనాలపై నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు కొత్త విషయాలు నేర్చుకునేందుకు దోహదపడతాయన్నారు. వైద్యులు మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, వైద్య విభాగాధిపతులు రమ్య పాల్గొన్నారు.

భగవద్గీతతో ఆధ్యాత్మిక మార్గదర్శనం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రఘునాథ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత ద్వారా భక్తి, ఆధ్యాత్మిక మార్గదర్శనం జరుగుతుందని టీటీడీ ధర్మప్రచార పరిషత్ (డీపీపీ) కార్యదర్శి రఘునాథ్ పేర్కొన్నారు. భగవద్గీత కంఠస్థ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డీపీపీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రఘునాథ్ మాట్లాడారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందన్నారు. చెడుపై మంచి విజయం సాధించడమే గీతా సారాంశమన్నారు. సభలో సంస్కృత ఆచార్యులు చక్రవర్తి రాఘవన్, సముద్రాల దశరథ్, రామకృష్ణ శేషసాయి, సునీత, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి గీతా సారాంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో డీపీపీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కోకిల పాల్గొన్నారు.

పోషకాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం



తల్లులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కిరీటి

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంపైనే చిన్న పిల్లల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని చిన్నపిల్లల వైద్య నిపుణుడు కిరీటి తెలిపారు. రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో బుధవారం పిల్లలకు పోషకాహారం, పరిశోధనకు సంబంధించి ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం అంటే ప్రత్యేకంగా ఉండదని, ఆకుకూరలు, చిరుధాన్యాలు వంటి వాటిల్లోనే ఉంటుందనేది గుర్తించాలన్నారు. అనంతరం చిన్నారులకు ఎటువంటి ఆహారం అందించాలనే దానిపై ఆయన చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్, డాక్టరు సునీత, రాజశేఖర్ పాల్గొన్నారు.

రేషన్‌కు సర్వర్ కష్టాలు

గంటల తరబడి కార్డుదారుల పడిగాపులు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రేషన్‌కు సర్వర్ కష్టాలు తప్పడంలేదు. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉండడంతో కార్డుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతిలోని 102 రేషన్ దుకాణాల్లో మధ్యాహ్నం నుంచి గంట పాటు సర్వర్ బాగా పనిచేసింది. 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేయకపోవడంతో కార్డుదారులు పనులు వదులుకుని పడిగాపులు కాయల్సి వచ్చింది. చలిగాలి, చిరుజల్లుల మధ్య వణుకుతూ రేషన్ దుకాణాల వద్ద చంటి బిడ్డలతో పడిగాపులు కాశారు. రాత్రి వరకు శివజ్యోతినగర్‌లోని ఒక రేషన్ దుకాణం వద్ద చంటి బిడ్డలతో కార్డుదారులు పడిగాపులు కాస్తున్న ఉదంతాలు కనిపించాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, సరిచేయాలని కోరుతున్నారు.



ఘనంగా భారతీయ భాషా దివస్-2024

తిరుపతి(విశ్వవిద్యాలయాలు)డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, యూజీసీ ఆదేశాల మేరకు యూనివర్సిటీల్లో భారతీయ భాషా దివస్-2024 ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో కల్చరల్ అఫైర్స్ - ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆర్ట్స్ డీన్ మురళీధర్, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పద్మావతి వర్సిటీ ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని పాల్గొని మాట్లాడారు. మన భాష, సంస్కృతిని గౌరవిస్తూనే దేశంలోని అన్ని భాషలు, సంప్రదాయాలను గౌరవించాలన్నారు.సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉద్యోగులు హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



పద్మావతి వర్సిటీలో గిరిజన సంప్రదాయ నృత్యం



ఎస్వీయూలో సంప్రదాయ నృత్యం

అక్కదేవతలారా దీవించండి!



తిరుమల మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద అక్కదేవతల ఆలయం ఉంది. దాదాపు 80 ఏళ్ల చరిత్ర ఈ ఆలయానికి ఉంది. 1940లలో తిరుమలకు తొలి కనుమదారి నిర్మాణం జరుగుతున్నపుడు ఇక్కడ అక్కదేవతల శిలలు కనిపించాయి. వాటిని తొలగించి నిర్మాణం కొనసాగించారు. అయితే అనేక అవరోధాలు ఎదురవుతూ నిర్మాణం క్లిష్టంగా మారిందని, ఆ సమయంలో అక్కదేవతల ప్రాముఖ్యం గురించి స్థానికులు అధికారులకు వివరించారని అంటారు. దాంతో వారు వెంటనే సప్తమాతృకలను రోడ్డుపక్కనే ఉన్న పెద్ద బండరాతికింద ప్రతిష్ఠించారని చెబుతారు. అప్పటి నంచీ అక్కదేవతలకు పూజలు జరుగుతున్నాయంటారు. తిరుమల ఘాట్‌లో క్షేమంగా ప్రయాణాలు జరగాలని కోరుకుంటూ టీటీడీ రవాణా విభాగం 2008 నుంచీ అక్కదేవతలకు కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగిస్తోంది. శుక్రవారం ఉదయం ఇక్కడ టీటీడీ డ్రైవర్లు, స్థానికులు కలిసి ఘనంగా పూజలు నిర్వహించనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి సేవలో నటి వాసుకి

తిరుమల శ్రీవారిని బుధవారం సినీనటి, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్‌సాయి సతీమణి వాసుకి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆమె దర్శనం చేసుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఎలక్ట్రిక్ చోటా లగేజీ స్కూటర్



ఇది ఆటో కాదు.. ట్రాలీ కాదు.. బ్యాటరీతో నడిచే లగేజీ వాహనం. తిరుపతి నగరంలో సందుగొందుల్లో శబ్దం లేకుండా దూసుకుపోతూ సందడి చేస్తోంది. వివిధ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులకు మధ్యాహ్నభోజనం తీసుకువెళ్లేందుకు ఇస్కాన్ సంస్థ ఈ వాహనం వినియోగిస్తోంది. చిన్న సందుల్లో వెళ్లడం ట్రాలీలకు కష్టంగా మారడంతో తమకు ఉపయోగపడేలా ఎలక్ట్రిక్ లగేజీ స్కూటర్‌ను మలచుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో మినీ బ్యాటరీ ఆటోల గురించి తెలుసుకుని అనంతపురంలో ఒక లగేజీ స్కూటర్‌ను కొని ఇలా ట్రక్కులా మార్చుకున్నారు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చయింది. ఎండా,వానా ఏదొచ్చినా ఆహారపదార్థాలకు ఇబ్బంది లేకుండా బడులకు ఈ వాహనం చేరవేస్తోంది.

-తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



హుండీ ఆదాయం రూ.4.27 కోట్లు


తిరుమల, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8గంటల సమయం పడుతోంది.బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

హుండీ(సోమవారం నాటిది) ద్వారా: రూ.4.27 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 67,284

తలనీలాలు సమర్పించినవారు: 19,064

శ్రీకాళహస్తిలో ఏడు గంగల వేడుక



శ్రీకాళహస్తి,డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):శ్రీకాళహస్తిలో బుధవారం ఏడుగంగమ్మల జాతర వైభవంగా జరిగింది. గంగమ్మలను దర్శించుకునేందుకు భక్తజనం పోటెత్తడంతో వీధులు కిక్కిరిసిపోయాయి. శ్రీకాళహస్తి పట్టణంలో యేటా డిసెంబరులో ఏడుగంగమ్మల జాతర నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అమ్మవార్లకు సారె సమర్పించారు. ఏడు ప్రాంతాల్లోని ఏడుగంగమ్మలను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా బుధవారం వేకువజామున 3 గంటల సమయంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చారు. కుంభం, ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. అక్కడి నుంచి ఏడుగురు అమ్మవార్లనూ ఒకరి వెనుక వరుసగా ఊరేగించారు. తప్పెట్లు, తాళాలు, మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు మధ్య భక్తులు తన్మయత్వంతో చిందులేశారు. బుధవారం రాత్రి ఏడుగంగమ్మలూ ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 వ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న పది మంది విదార్థులను డీబార్ చేశారు. తిరుపతిలో ముగ్గురు, చిత్తూరులో ఏడుగురిని డీబార్ చేసినట్టు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

సముద్రంలో ‘అల’జడి

● ఆగిన చేపల వేట

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చదురు మదురుగా వర్షంతోపాటు చలిగాలులు వీస్తుండటంతో బుధవారం మత్స్యకారులు చేపల వేటను నిలిపివేశారు. కోట మండలంలోని పలు సముద్రతీర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడి వర్షపుజల్లులు పడుతున్నాయి. శ్రీనివాససత్రం, కొత్తపట్నం, గోవిందపల్లిపాళెం గ్రామాల సమీపంలో ఉన్న సముద్రం కసురుపై ఉండి ఒక్కసారిగా అలల ఉధృతి పెరగడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.

భూవివాదం కోర్టులో వున్నా దౌర్జన్యంగా కంచె తొలగించారు!

● పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

తిరుపతి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సర్వే నెంబరు 478లో నా భూమి విషయమై తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి కుటుంబీకులతో వివాదం హైకోర్టులో పెండింగులో ఉండగానే.. దౌర్జన్యంగా కొందరు కంచెను తొలగించారంటూ బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు తండ్రి ద్వారా సంక్రమించిన ఆ భూమిని ఇచ్చేయాలంటూ కొంతకాలం కిందట అప్పటి తిరుపతి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఆయన సతీమణి రేవతీరెడ్డిల ప్రోద్బలంతో కొందరు తమపై పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డారని అందులో పేర్కొన్నారు. తన భూమిలోని 64 టేకు చెట్లు, 40 మామిడి చెట్లను కూడా నరికివేశారని, దానికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదు వెంట జతచేశారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా కేసు పెండింగులో ఉందని పేర్కొన్నారు. తాజాగా బుధవారం కొందరు వ్యక్తులు తన భూమిలోకి ప్రవేశించి ఎక్స్‌కవేటరుతో దౌర్జన్యంగా కంచెను తొలగించారని పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో క్లిప్పులను కూడా ఫిర్యాదుతో పాటు పంపించారు. గతంలో లాగానే మళ్లీ బెదిరింపులకు పాల్పడుతున్నందున తమకు ప్రాణ హాని ఉందని ఆందోళన వ్యక్తం చేసిన బాధితుడు.. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని నిందితులను శిక్షించాలని కోరారు. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న అందరిపై కేసు నమోదు చేయాలని, తనకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను బాధితుడు కోరారు. కాగా, బాధితుడు చెరుకూరు వెంకటేశ్వర ప్రసాద్ కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అలాగే ఎఫ్‌సీఐకి సంబంధించి ఏపీకి ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యుడుగానూ వ్యవహరిస్తున్నారు.

ఆహార కొరతను అధిగమించేలా పరిశోధనలు జరగాలి

● జాతీయ సదస్సులో పశువైద్య విద్యార్థులకు పిలుపు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశ్‌రావు, షెజియన్ తదితరులు

తిరుపతిరూరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆహార కొరతను అధిగమించేందుకు సరికొత్త పరిశోధనలు ఆవిష్కరించాలని చెన్నైకి చెందిన ప్రకాశ్ ఫుడ్‌మీల్స్ సంస్థ అధినేత డాక్టర్ ప్రకాశ్‌రావు సూచించారు. తద్వారా భావితరాలకు ఆహార భద్రత కల్పించాలన్నారు. 'పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి' అంశాలపై దేశంలోనే తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఎస్వీవెటర్నరీ కళాశాల వేదికగా చేపట్టిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. పశువైద్య విద్య విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి తమతోపాటు ఇతరులకు కూడా ఉపాధి కల్పించాలన్నారు. పారిశ్రామికవేత్తగా తన ఎదుగుదలను వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తినింపారు. దేశీయ ఆవుల, గేదె జాతుల జన్యుసమర్థతను ఉపయోగించుకుని భవిష్యత్తరాలకు మేలైన దేశీయ పశుజాతి రకాలు అందించాలని పాండిచ్చేరి వెటర్నరీ కళాశాల డీన్ డాక్టర్ షెజియన్ ఆకాంక్షించారు. తొలిసారిగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల పరిశోధనాంశాలకు సంబంధించి జాతీయస్థాయి సదస్సు నిర్వహించడం అభినందనీయమని కేంద్ర పశుసంవర్థకశాఖ మాజీ కమిషనర్ డాక్టర్ సురేష్ హోన్నప్పగల్ కొనియాడారు. వివిధ సెషన్స్‌లో దాదాపు 130 పరిశోధనాంశాలను ప్రజంటేషన్ చేయనున్నారని, వీటిలో ఉత్తమ పరిశోధనాపత్రాలను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేస్తామని సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ పి.జగపతి రామయ్య వివరించారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. పలువురు పరిశోధకులు తమ పరిశోధనాంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్, డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డాక్టర్ కె.సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజా తదితరులు పాల్గొన్నారు.



రంగనాథుడికి టీటీడీ పట్టు వస్త్రాల సమర్పణ

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలోని రంగనాథ స్వామికి బుధవారం టీటీడీ తరపున బుధవారం ఈవో శ్యామలరావు పట్టువస్త్రాలు సమర్పించారు. దేశవ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన పుణ్యక్షేత్రాలకు టీటీడీ 2008 నుంచి పట్టువస్త్రాలను సమర్పిస్తోంది. అందులోభాగంగా ఈఏడాది కూడా శ్రీరంగం ఆలయానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్న టీటీడీ ఈవోకు శ్రీరంగం ఆలయ జాయింట్ కమిషనర్ మరియప్పన్ స్వాగతం పలికారు. అనంతరం ఈవో.. పీఠాధిపతికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రధాన ఆలయ సముదాయంలో ఉన్న మూలవిరాట్ ఇతర ఉప ఆలయాలను దర్శించుకున్నారు. సాధారణంగా శ్రీరంగం ఆలయ అధికారులు ఏటా ఆణివారి ఆస్థానం రోజున తిరుమల ఆలయానికి వస్త్రాలను సమర్పిస్తారు. ఈ పవిత్ర కార్తీక మాసం ఏకాదశి రోజున శ్రీరంగం ఆలయానికి టీటీడీ పట్టువస్త్రాలను అందజేస్తుంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

18న ఆర్టీసీ అప్రెంటిస్‌షిప్ కౌన్సెలింగ్

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులు శిక్షణ, డిపోల అలాట్‌మెంట్‌కు ఈనెల 18న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ 39, మోటార్ 2, ఎలక్ట్రీషియన్ 17, వెల్డర్ 1, పెయింటర్ 1, ఫిట్టర్ 2 మొత్తం 62 ఖాళీలున్నాయి. ఐటీఐ అభ్యర్థులు ఆ రోజున ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయానికి హాజరుకావాలని కోరారు.

మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు పెట్టాలి

● ఎస్పీ కార్యాలయం వద్ద జర్నలిస్టుల ధర్నా



తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబు, ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని జర్నలిస్టులు డిమాండు చేశారు. ఈ మేరకు తిరుపతి ఎస్పీ కార్యాలయం వద్ద బుధవారం ఏపీయూడబ్ల్యుజే, ప్రెస్‌క్లబ్, ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. హైదరాబాదులో మోహన్‌బాబు, మోహన్‌బాబు యూనివర్సిటీ వద్ద సుమన్ టీవీ ప్రతినిధి ఉమాశంకర్, కెమెరామేన్ నరసింహపై బౌన్సర్లు దాడికి పాల్పడటం దారుణమని ఏపీయూడబ్ల్యుజే అధ్యక్షుడు ప్రసాద్ అన్నారు. వీడియో షూట్ చేస్తున్న తమను కొందరు బౌన్సర్లు అడ్డుకోవడంపై పీఆర్వో సతీష్ వచ్చి మాట్లాడుతుండగా.. వెనుకవైపు నుంచి 10 మంది బౌన్సర్లు వచ్చి తమపై దాడి చేసి కొట్టారని ఉమాశంకర్ తెలిపారు. పోలీసులు విచారణ జరిపి జర్నలిస్టులపై దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మురళి డిమాండు చేశారు. హైదరాబాదు, తిరుపతిలో జరిగిన ఘటనలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర కోరారు. అనంతరం అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారికి వినతిపత్రం అందచేశారు. ఏపీ ఫొటోగ్రాఫర్ల సంఘం నేత గిరిబాబు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర, సీనియర్ జర్నలిస్టులు దినేష్, రాజు, కల్లుపల్లి సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలే దేశాన్ని అగ్రగామిగా నిలుపుతాయి

● ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ ఫినాలే పోటీల ప్రారంభం

ఏర్పేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 'దేశంలో సాంకేతిక, విద్యారంగాల్లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమం నూతన ఒరవడికి నాంది పలుకుతంది. ఈ కార్యక్రమం ద్వారా నూతన ఆవిష్కరణలెన్నో రూపొంది దేశాన్ని అగ్రగామిగా నిలుపుతుంది' అని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడు సమీపంలోని ఐఐటీ ప్రాంగణంలో ఉన్న ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం హ్యాకథాన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ వేడుకల్లో ఆయనతో పాటు తిరుపతి ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా 51 నోడల్ కేంద్రాల్లో జరుగుతున్న ఈ ఫినాలే పోటీల్లో 1,300 మంది యువ ఆవిష్కర్తల బృందాలు వివిధ అంశాలపై నూతన ఆవిష్కరణలు, కోడ్ సొల్యూషన్ ప్రక్రియలు చేపడుతున్నాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఏర్పేడు ఐఐటీ ప్రాంగణంలో ఆరుగురు సభ్యులు, ఇద్దరు మెంటార్లు, 21 జట్లు సాఫ్ట్‌వేర్ కోడ్ సొల్యూషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఆయుష్ అంశాలపై కేంద్ర విద్య, ఆయుష్ శాఖల ద్వారా అందించిన సవాళ్లకు కొత్త ఆవిష్కరణలపై నిరంతరాయంగా 36 గంటల మేధో మదనాన్ని ప్రారంభించారు. ఉదయం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వర్చువల్‌గా దేశవ్యాప్తంగా ఫినాలే మారథాన్‌ను ప్రారంభించారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమార్పులు

దశాబ్దకాలంగా దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ యువ ఆవిష్కర్తలకు వివరించారు. సాయంత్రం ఆయన 51 నోడల్ కేంద్రాల్లో పాల్గొన్న వారితో వర్చువల్‌గా మాట్లాడారు. 2017లో జరిగిన హ్యాకథాన్‌లో 7వేల నూతన ఆవిష్కరణలు చేయగా ప్రస్తుతం 57వేలకు చేరిందన్నారు. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచామన్నారు.





వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులు - టీమ్ స్టాక్ స్క్వాడ్ చేస్తున్న కోయంబత్తూరు విద్యార్థులు

గదుల కోసం భక్తుల పాట్లు



గదుల కోసం 'పద్మావతి' ముందు నిరీక్షిస్తున్న భక్తులు

తిరుమల, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం బుధవారం తిరుమలకు వచ్చిన భక్తులు వసతి కోసం ఇబ్బంది పడ్డారు. సామాన్య భక్తులకు గదులు కేటాయించే సీఆర్వోలోని కౌంటర్లు సాయంత్రానికే మూతపడ్డాయి. సిఫార్సు లేఖలపై గదులు కేటాయించే పద్మావతి, ఎంబీసీ24 కౌంటర్లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రానికి ఈ గదులూ బుక్ అయ్యాయి. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, మంత్రులు వంటి ప్రజాప్రతినిధులు పరిమితికి మించి గదులు పొందటంతోనే ఈసమస్య వచ్చినట్టు తెలుస్తోంది. ఒక్కో ప్రజాప్రతినిధి రెండు నుంచి మూడు గదులు పొందుతున్నట్టు సమాచారం. దీంతో ఎన్నడూ లేనివిధంగా సాయంత్రానికి పద్మావతిలోని గదులన్నీ బుక్ అయ్యాయి. ఈ మేరకు కౌంటర్లలోని సిబ్బంది మైకులద్వారా ప్రచారం చేశారు. దీంతో రిసెప్షన్ అధికారులు సాధారణ గదులనే పద్మావతికి మళ్లించి సిఫార్సు లేఖలపై అడపాదడపా కేటాయిస్తూ అర్ధరాత్రి వరకు నెట్టుకొచ్చారు. మరోవైపు ఎంబీసీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రద్దీ సాధారణంగానే ఉన్నప్పటికీ గదుల కొరత మాత్రం భక్తులను ఇబ్బందులకు గురిచేసింది.

నిరుపయోగంగా పోలీసు అవుట్‌పోస్ట్



గూడూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనార్దనరెడ్డికాలనీ సమీపంలో నిర్మించి న పోలీస్ అవుట్ పోస్టు గది నిరుపయోగంగా మారింది. చల్లకాలువ సమీపంలోని జనార్దనరెడ్డికాలనీ వద్ద 2003లో దాతల సహకారంతో పోలీస్ అసిస్టెన్స్ గది నిర్మాణ పనులను చేపట్టారు. ఈ గది నిర్మాణం దాదాపు పూర్తి చేసినా మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయింది. ప్రధానంగా ఈ ప్రాంతంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉండటంతో పాటు పట్టణ పొలిమేర కావడంతో ఇక్కడ నేరాలను నియంత్రించేందుకు, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు గతంలో చర్యలు చేపట్టారు. పోలీస్ అసిస్టెన్స్ గదిని నిర్మించి ఇక్కడ పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. అయితే భవన నిర్మాణం పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోలేదు. గత కొన్నేళ్లుగా నిరుపయోగంగానే నిలిచిపోయింది. దీంతో రాత్రి సమయాలలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. గది అసంపూర్తి పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

గూడూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేగనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల్లో ఎంపీటీసీలు విఘ్నేశ్వర్‌లాల్, గోపీనాయక్, భక్తులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



మాట్లాడుతున్న సంజీవయ్య

నాయుడుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు అండగా వైసీపీ ఉంటుందని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట వైసీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు తక్షణమే పెట్టుబడి సాయం చేయాలని, ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండు చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని, దళారీ వ్యవస్థను తొలగించాలని, వర్షాలకు తడిచిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయం ముఖద్వారం వద్ద సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఎంపీపీ ధనలక్ష్మి కోరారు. ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పశు వైద్యశాల, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, వ్యవసాయ శాఖ కార్యాలయాలు ఉన్నాయని.. వర్షం పడితే కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడారు.

నాయుడుపేటలో చిరుజల్లులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి చిరుజల్లులు పడ్డాయి. గ్యాస్‌లైన్ల కోసం రోడ్ల పక్కన గుంతలు తవ్వి ఉండటంతో కురిసిన వర్షానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పుత్తూరు వార్తలు

గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే భానుప్రకాష్



ట్రాక్టర్లు నడుపుతున్న ఎమ్మెల్యే, మాధవయ్య

పుత్తూరు టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్ద పీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. బుధవారం కేబీఆర్‌పురం, తడుకు పంచాయతీలకు చెత్త సేకరణ కోసం రూ.12 లక్షలతో మంజూరైన రెండు ట్రాక్టర్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరక్టర్ మాధవయ్య, సర్పంచులు బొబ్బిలి యాదవ్, జానకి, నాయకులు వాజ్‌పేయి నాయుడు, కరుణాయాదవ్, మోహన్ రాజు. మహేష్, కార్యదర్శులు నరేష్, ఎంపీడీవో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్ ప్రారంభం



వడమాలపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణ, పారిశుధ్య అవసరాల నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన ట్రాక్టర్‌ను టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి ధనుంజయులు నాయుడు ప్రారంభించారు. మేజర్ పంచాయతీ వడమాలపేటకు స్వచ్ఛ ఆంధ్ర నిధులతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా ట్రాక్టర్‌ను ప్రభుత్వం అందించడం సంతోషకరమని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరచేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి రితేష్, టీడీపీ నాయకులు వెంకటయ్య, శివ, వెంకట్రామ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాస్ సంఘానికి వివాహ సామగ్రి వితరణ

పుత్తూరు టౌన్, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజ సేవా సంఘ భవనానికి మండలంలోని గొల్లపల్లికి చెందిన శ్రీరాం గోపీరాయల్ బుధవారం రూ.10 వేల విలువైన వివాహ సామగ్రి వితరణ చేశారు. ముందుగా శ్రీకృష్ణదేవ రాయలు చిత్రపటానికి నివాళులర్పించారు. బాస్ సంఘ నాయకులు శివయ్య, క్రిష్ణయ్య, చక్రి, గోపీరాయల్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

వడమాలపేట, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు జీవనాధారమైన భూముల్లో లోటు పాట్లను సరిదిద్ది రక్షణగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ జరీనా చెప్పారు. బుధవారం వడమాలలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో వచ్చిన అర్జీలను గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేసి, గ్రామస్తుల సమక్షంలో విచారణ జరిపి పరిష్కస్తామని తహసీల్దార్ చెప్పారు. టీడీపీ నాయకులు జానా వెంకటయ్య, హేమావతి, ఉమాపతి, కుమార్, వినోద్, చైతన్య, శివ, వీఆర్వో చక్రవర్తి, సర్వేయర్ గురువారెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రెవెన్యూ సదస్సులు

పుత్తూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపాళెం, వీరప్పరెడ్డిపాళెంలలో బుధవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. మున్సిపాలిటీ ప్రాంతం కావడంతో ఇళ్లపట్టాలకు 96, ఆర్‌ఓఆర్‌కు 9 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

బాలసదనంలో వసతుల మెరుగుకు చర్యలు



బాలసదనంలో వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాలసదనంలో వసతుల మెరుగుకు చర్యలు చేపడుతానని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక నరశింగరావుపేటలోని బాలసదనం వసతిగృహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. విద్యార్థినులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. పేదలను విద్యలో ప్రోత్సహించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పలు నూతన సంస్కరణలను తీసుకొస్తున్నారన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రహీమ్, సీడీపీవో మొహబూబీ, కేశవనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

'చిరంజీవి కుటుంబానికి అండగా ఉంటాం'

వాకాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సైదాపురం మండలం చాగణం గ్రామానికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు చిరంజీవి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చిరంజీవి ఇంటి వద్ద మాట్లాడుతూ అతనిపై పలు తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. ఈ నేపథ్యంలో వెంకటగిరి నియోజకవర్గ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చిరంజీవికి స్టేషన్ బెయిల్ వచ్చేలా చేశామన్నారు. న్యాయ వ్యవస్థపై విశ్వాసం పెరిగిందన్నారు. వైసీపీ కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉండి కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

వాకాడు, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గత 6 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు, నిడిగుర్తి మాజీ సర్పంచ్ వాకాటి సంపత్‌కుమార్ డిమాండు చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాల ప్రజలు నిడిగుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారని.. వైద్యుడి నిర్లక్ష్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు అవస్థలు తప్పడం లేదన్నారు. ఆసుపత్రిలో పనిచేసే సిబ్బందిని వేధిస్తున్నారని.. ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండటం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

అవసరమైన పనులను గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వేణు

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలకు అవసరమైన పనులనే గుర్తించి చేపట్టాలని ఎంపీడీవో వేణు కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఉపాధి క్షేత్ర సహాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కూలీల శాతం పెంచాలన్నారు. వంద రోజుల పనులు, రాయితీలపై అవగాహన కల్పించాలన్నారు. నిర్లక్ష్యం చేసిన క్షేత్ర సహాయకులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో పూర్ణిమ, టెక్నికల్ అసిస్టెంట్ శాంతి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చిట్టేడులో పోలేరమ్మ ఉత్సవం



పోలేరమ్మ అమ్మవారి ఊరేగింపు

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిట్టేడులో బుధవారం పోలేరమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, గంగపెట్టితో గ్రామోత్సవం చేపట్టారు. భక్తు లు అమ్మవారికి అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కానుకలు సమర్పించారు.

రేకుల షెడ్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

నాయుడు పేట, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): నాయుడు పేట ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రోటరీక్లబ్ సహాయంతో రేకుల షెడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెసల జయరాజ్ గోపాల్, సభ్యులు చంద్రశేఖర్, కృష్ణారావు, రామచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌వర్మ, రోటరీక్లబ్ సభ్యులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

పోలీసులకు శారీరక ధారుఢ్యం అవసరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసులు శారీరక ధారుఢ్యం కలిగి ఉండాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక 9వ బెటాలియన్‌లో నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు ప్రజలకు నమ్మకాన్ని కల్పించాలని కోరారు. ప్రభుత్వం పోలీసులకు ప్రత్యేక స్థానం కల్పించిందన్నారు. 9వ బెటాలియన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని.. ఇప్పటికే బెటాలియన్‌లో సీసీ రోడ్లు, అభివృద్ధి పనులు నిర్వహించామని తెలిపారు.

పంటల బీమా తప్పనిసరి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేసుకోవాలని ఏడీఏ నాగర్జునసాగర్ అన్నారు. బుధవారం స్థానిక యాచసముద్రం, జంగాలపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి చెందిన రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా ఈనెల 15వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం పశువుల్లో వచ్చేవ్యాధులు వాటి నివారణకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సుజాత, రామ్మోహన్, గోపీకృష్ణ, సుమతి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం కారూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్థుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చి రైతులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నం చేసిందని.. ఆ చట్టాన్ని నేడు టీడీపీ ప్రభుత్వం రద్దుచేసిందని తెలిపారు. ప్రజలందరూ.. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దారు శరత్ బాబు, రెవెన్యూ, అటవీ, రిజిస్ట్రేషన్ల శాఖల అధికారులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండలంలోని కొండవల్లిపాడు, ఆచార్లపార్లపల్లి, రుద్రాయపాళెం గ్రామాలలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజలు పలు భూ సమస్యలపై అర్జీలు అందించారు. అర్జీలన్నిటికీ పరిష్కారం చూపుతామని తహశీల్దారు పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో రెవన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండలంలోని పాకపూడి, గొట్టికాడు గ్రామాల్లో బుధవారం తహశీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు భూ సమస్యలపై 23 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండల పరిధిలోని మంగానెల్లూరు, అచ్చుకట్ల గ్రామాల్లో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు ఎస్‌వి.నరసింహరావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ .శేఖర్, టీడీపీ నాయకులు గాడి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: ముట్టెంబాక, జువ్వినట్టు గ్రామాల్లో తహశీల్దారు రామయ్య ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో పలు సమస్యలపై 25 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, టీడీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ అనిల్‌రెడ్డి, మధురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోట: ఊనుగుంటపాళెంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. రైతులు పలు భూసమస్యలపై 5 అర్జీలను అందించారు. తహశీల్దారు జయజయరావు, ఎంపీపీ అంజమ్మ, డీటీ అజమతుల్లాఖాన్, ఆర్ఐ మధులత, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: భూవివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తునట్లు సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం చిల్లకూరు గ్రామ సచివాలయంలో జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం అర్జీలు స్వీకరించారు. తహశీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి, ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ పూజిత, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పాపాడి రాజగోపాల్ రెడ్డి, సర్పంచి హరిబాబురెడ్డి, సిద్దులయ్యనాయుడు, పాలచ్చూరు సుబ్బరామయ్య, మునిచంద్ర, రాకేష్‌రెడ్డి, వేణురెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. గ్రామాల్లో చైతన్యం కల్పించాలని .. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామని సీడీపీవో మునికుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో విధిగా సభ్యులకు బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించాలన్నారు. ఆడ పిల్లలను కాపాడుకుందామని.. నిర్దిష్ట వయసులో మాత్రమే వివాహం చేయాలని గడపగడపకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన యాప్‌లపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం



వ్యవసాయ ఉత్పత్తులు పరిశీలిస్తున్న అధికారులు

పెళ్లకూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులు నిల్వచేసుకోవచ్చని నాబార్డ్ జిల్లా మేనేజర్ బాబు పేర్కొన్నారు. బుధవారం తాళ్వాయిపాడులో నూతనంగా నిర్మించిన కోల్డ్ స్టోరేజ్‌ను ఆయన ప్రారంభించారు. రైతుల పండించే పంటలకు మద్దతు ధర లేని సమయాల్లో తక్కువ రేట్లుకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారని. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో ధరలేని సమయంలో నిల్వ చేసుకుని మంచి ధరలు ఉన్నప్పుడు రైతులు విక్రయించుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో మయా వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ, మండల ఉద్యాన అధికారిణి శారద, కోల్డ్ స్టోరేజ్ డైరెక్టర్ కట్టా బాలసుబ్రహ్మణ్యం, ఎన్జీవో చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను బుధవారం అధికారులు విడుదల చేశారు. సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు సంబంధించి మొత్తం 72 సాగునీటి సంఘాలకు ఎన్నికలకు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జలవనరుల శాఖ డీఈ శ్రీధర్ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి 18 మందిని ఎన్నికల అధికారులుగా నియమించారు.

వైద్యులకు ముగిసిన శిక్షణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతన వైద్య విధానాలపై ఎస్వీ వైద్య కళాశాలలో మూడు రోజులుగా వైద్య అధ్యాపకులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగుతులు బుధవారంతో ముగిశాయి. ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ వైద్య విద్యలో నూతన అధ్యయనాలపై నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు కొత్త విషయాలు నేర్చుకునేందుకు దోహదపడతాయన్నారు. వైద్యులు మార్పులను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, వైద్య విభాగాధిపతులు రమ్య పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నోటీసులు అందజేస్తున్న ఫుడ్ కమిషనర్ నర్మద

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వ్యాపార యజమానులు తయారు చేసే వస్తువులపై నాణ్యత ప్రమాణాలు పాటించాలని తిరుపతి ఫుడ్ కమిషనర్ నర్మద సూచించారు. బుధవారం స్థానిక క్రాస్ రోడ్డు, పాత బస్టాండు, పోలేరమ్మ ఆర్చి సెంటర్, కాశీపేట తదితర ప్రాంతాల్లో ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారాలు నిర్వహించే ప్రతిఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలన్నారు. పలు తినుబండారాల్లో కలర్ అత్యధింగా వేస్తున్నారని 1శాతం మాత్రమే వేయాలని ఆదేశించారు. తినుబండరాలను బహిరంగ ప్రదేశాల్లో పెట్టకూడదని వాటిని బాక్సులు ఏర్పాటు చేసిన వాటిల్లో మాత్రమే అమ్మకాలు చేయాలన్నారు. వంట నూనెలు ఒకటి, రెండు సార్లు మాత్రమే వాడాలన్నారు. అనంతరం పలు దుకాణాలకు నోటీసులు అంటించారు.

వైసీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటా: నేదురుమల్లి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11,(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో అండగా ఉంటామని వైసీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి తన నివాసంలో అందుబాటులో ఉంటానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలకేంద్రం- పాత బస్టాండ్ దారిలో ఆటో, మోటర్ సైకిల్ ఢీకొన్న సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు శ్రీ కాళహస్తి మండలం మన్నవరం గ్రామానికి చెందిన తేజ మోటారు సైకిల్‌పై పాలకేంద్రం సమీపం నుంచి పాతబస్టాండ్ వైపు వస్తున్నారు. ప్రయాణికులు ఎక్కించుకుని ఆటో పాత బస్టాండు నుంచి పాలకేంద్రం వైపుగా వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తేజకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా భారతీయ భాషా దివస్



ఎస్వీయూలో సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, యూజీసీ ఆదేశాల మేరకు యూనివర్సిటీల్లో భారతీయ భాషా దివస్-2024 ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియంలో కల్చరల్ అఫైర్స్ - ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టాయి. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆర్ట్స్ డీన్ మురళీధర్, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పద్మావతి వర్సిటీ ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని పాల్గొని మాట్లాడారు. మన భాష, సంస్కృతిని గౌరవిస్తూనే దేశంలోని అన్ని భాషలు, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, ఉద్యోగులు హాజరయ్యారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

పేద విద్యార్థులకు దన్నుగా ప్రభుత్వం

● చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 101 వసతి గృహాలకు రూ.15.17కోట్ల మంజూరు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించింది.ఐదేళ్ల వైసీపీ పాలనలో వసతి గృహాలను పట్టించుకోకపోవడంతో పెచ్చులూడిన పైకప్పులు, శిథిలమైన మరుగుదొడ్లు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు, రెక్కలు విరిగిన ఫ్యాన్లు, నీళ్లు కారుతున్న గదుల్లోనే విద్యార్థులు బస చేయాల్సి వచ్చింది.చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ బాధ్యతలు తీసుకున్న తొలి నాళ్లలోనే వసతి గృహాల మరమ్మతులపై దృష్టిసారించారు. విద్యార్థులకు ఏమి అవసరమో గుర్తించి ఒకటికి రెండుసార్లు నివేదికలు తెప్పించుకుని ప్రభుత్వానికి పంపారు.ఈ నేపథ్యంలో వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది.చిత్తూరు జిల్లా పరిధిలో 46 సాంఘిక సంక్షేమ వసతి గృహాలున్నాయి. వీటిలో మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.04 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.109.83 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్‌కు రూ.114.75 లక్షలు, కిటికీలకు మెష్‌ల ఏర్పాటుకు రూ.66.15 లక్షలు, డోర్లు, విండోల మరమ్మతులకు రూ.44.27 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.94.67లక్షలు, ఫ్లోరింగ్‌కు రూ.70.38 లక్షలు, ప్రహరీ నిర్మాణాలకు రూ.91.83లక్షలు, ఇతర పనుల కోసం రూ.205.71 లక్షలు కేటాయించారు.తిరుపతి జిల్లాకు సంబంధించి మైనర్ రిపేర్ల కింద మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.122.71 లక్షలు, తాగునీటి సరఫరాకు రూ.82.11 లక్షలు, ఎలక్ట్రిఫికేషన్ కోసం రూ.81.24లక్షలు, మెష్‌ల ఏర్పాటుకు రూ.46.80 లక్షలు, డోర్లు, విండోల కోసం రూ.67.92 లక్షలు, అవసరమైన ఇతర పనుల కోసం రూ.83.82 లక్షలను కేటాయించారు. మేజర్ రిపేర్ల కింద రూఫ్ మరమ్మతుల కోసం రూ.78.63 లక్షలు, ఫ్లోరింగ్ కోసం రూ.63.50 లక్షలు, ప్రహరీ నిర్మాణాల కోసం రూ.7.30 లక్షలు కేటాయించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ పనులను చేపట్టి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మౌఖికంగా ఆదేశాలు జారీ చేసింది.



ఓ హాస్టల్లో పాడైపోయిన కిటికీలపై దుస్తులను ఆరేసుకున్న విద్యార్థులు

రైస్‌మిల్లును మూసివేయించండి

ఊపిరితిత్తుల సమస్యలతో అల్లాడుతున్నాం ● ఆర్పీ అగ్రహారంవాసుల ఆందోళన


రైస్ మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రేణిగుంట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తివారిపల్లి పంచాయతీ ఆర్పీ అగ్రహారంలో కాలుష్యానికి కారణమవుతున్న రైస్‌మిల్లును మూసివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. తమ ప్రాంతంలో ఉన్న రైస్ మిల్లు కారణంగా ఊపిరితిత్తుల సమస్యలతో అల్లాడుతున్నామని ఆర్పీ అగ్రహారం వాసులు మిల్లు వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మిల్లు నుంచి దట్టమైన పొగతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ విషయమై కాలుష్య నియంత్రణ బోర్డుకు ఫిర్యాదు చేశామని, అధికారులు పరిశీలించారన్నారు. అయితే చర్యలు తీసుకోలేదన్నారు. ప్రస్తుతం ఉత్పత్తి పెంచడంతో పగలు, రాత్రి తేడా లేకుండా మిల్లు నడుస్తుండడంతో కాలుష్యం మరింత పెరిగిందన్నారు. బీపీ అగ్రహారం, బీసీకాలనీ, మాదిగవాడ, హరిజనవాడ ప్రాంతాలే కాక కిలోమీటరు వరకు ప్రభావం కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆర్పీ అగ్రహారంవాసులు డిమాండ్ చేశారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో వేడుకగా ఏకాదశి


దేవేరులతో తిరుచ్చిపై కల్యాణ వెంకన్న

నారాయణవనం, డిసెంబర్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధి చెందిన పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయంలో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని ఉభయ నాంచురులతో కల్యాణ వెంకన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, నిత్యపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో, స్వర్ణాభరణాలతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయనాంచారులతో స్వామివారిని మాడ వీధుల్లో ఊరేగించారు. ఏకాదశి కావడంతో భక్తులు ఉపవాస దీక్షతో స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించగా అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు పూజలు నిర్వహించారు.

ఉన్నత విద్యా ప్రమాణాలే ప్రధానం: ఆర్జేడీ


రికార్డులను తనిఖీ చేస్తున్న శామ్యూల్

శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉన్నతమైన విద్యాప్రమాణాలే ప్రధానమని కడప విద్యా శాఖ ఆర్జేడీ శామ్యూల్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. సమ్మేటివ్ పరీక్షల తీరును, రికార్డులను, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించారు. వంటశాలలను తనిఖీ చేశారు. ఇక ఇటీవల ఏర్పాటు చేసిన మాదిరి రాజ్యాంగ పరిషత్‌ను పరిశీలించి హెచ్‌ఎం రాజకుమారిని అభినందించారు.

పాతకక్షలతో పూరింటికి నిప్పు

కేవీబీపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంజూరుపాళెంలో పాతకక్షలతో ఇంటికి నిప్పుపెట్టాడు. గ్రామానికి చెందిన షణ్ముగం అలియాస్ పెద్దబ్బకు చెందిన ఇంటికి అదే గ్రామానికి చెందిన హరిబాబు మంగళవారం అర్ధరాత్రి నిప్పుపెట్టినట్టు బాధితుడు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉదయం పెద్దబ్బ, అతని భార్య పొలంలో ఉండగా హరిబాబు వెళ్లి పొలం తమది అంటూ గొడవ పడ్డాడు. ఈక్రమంలో పెద్దబ్బ ఆస్పత్రికి వెళ్లిన సమయంలో మంగళవారం ఇంటికి నిప్పు పెట్టాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఓబయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ఆరా తీశారు. నిందితుడు హరిబాబును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

వర్ష బాధితులకు సహాయాల పంపిణీ


బియ్యం, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. ఇందులో భాగంగా పాండూరు పంచాయతీ మట్టింగితిప్పలో ఫెంగల్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు నిరాశ్రయు లైన మూడు కుటుంబాలకు బియ్యం, రూ.5వేల నగదు అందజేశారు. సొంత ఇంటిని నిర్మించుకునే విధంగా ప్రభుత్వం తరఫున సాయం చేయించాలని అధికారులను కోరారు. నిరుపేదలకు ఇంటిస్థలాలను చూపించి పట్టాలను ఇచ్చేందుకు సిద్ధం చేయాలన్నారు. మండలంలోని జూనియర్ కళాశాల, బాలికల వసతిగృహ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. సర్పంచు కవిత, టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి, నాగరాజు, నందకిషోర్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, కరుణాకర్‌నాయుడు, ఎంపీడీవో ప్రసాద్, డీటీ వెంకటసుబ్బయ్య, ఆర్‌ఐ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాల ఢీ: తప్పిన ప్రమాదం



శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసుకగుంట వద్ద లారీ, మినీ లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై ఒకే మార్గంలో వాహనాలను అనుమతించడంతో లారీ, మినీలారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాల్లోని డ్రైవర్లు, క్లీనర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ ఘటనా స్థలానికి చేరుకుని రాకపోకలను క్రమబద్ధీకరించారు.

గంగమ్మల సేవలో ఎమ్మెల్యే సుధీర్



శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ఏడుగంగమ్మల జాతర అత్యంత వైభవంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ దంపతులు అమ్మవార్లను దర్శించుకున్నారు. గంగమ్మల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం కూడా ఏడుగంగమ్మలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కంఠా ఉదయ్, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు చుక్కాని ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 13న శుక్రవారం చుక్కాని ఉత్సవం జరగనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం రాత్రి 7.30గంటలకు చుక్కాని ఉత్సవం ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి అమ్మవార్లకు జరిగే నిత్య ఉత్సవం, అభిషేకాలు మొత్తం ఆలయ అధ్వర్యంలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా చుక్కాని ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఉత్సవానికి వినియోగించే తాటిచెట్టును కూడా సిద్ధం చేశారు.

ఆక్రమణలో రాళ్లేరు కాలువ



కేవీబీపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరె గ్రామంలో ఉన్న చెరువు నుంచి రైతుల కోసం ఏర్పాటు చేసిన పంట కాలువ రాళ్లేరు ఆక్రమణకు గురైంది. మిచౌంగ్ తుఫాన్ కారణంగా రాళ్ళేరు గట్లు దెబ్బతినింది. దానిని ఆసరాగా తీసుకుని కాలువ పక్కన ఉన్న పొలాల రైతులు ఎవరికి వారే వారి పొలానికి అనుకుని ఉన్న రాళ్ళేరును ఆక్రమించేసి సాగుకు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కాలువ పూర్తిగా ఆక్రమణకు గురై రాళ్ళేరు కాస్త చిన్న కాలువల మారిపోయింది. రెవెన్యూ అధికారులు స్పందించి రాళ్ళేరును రీసర్వే చేసి ఆక్రమణదారుల చెర నుంచి కాపాడాల్సి ఉంది.

సంబరాల జాతర




కార్గిల్ సెంటర్, ముత్యాలమ్మ గుడి వీధుల్లో రోడ్లపై ప్రత్యేక పూజలు చేస్తున్న స్థానికులు


మేకపోతుకు పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏడుగంగమ్మల జాతర సంబరాలతో శ్రీకాళహస్తి పట్టణం బుధవారం సందడిగా మారింది. పట్టణంలో ఎక్కడ చూసినా జనసందడి కనిపించింది. దీంతో కొన్ని చోట్ల ట్రాఫిక్ మళ్లించారు. పట్టణంలోని మొదటి గంగమ్మ పొన్నాలమ్మ అమ్మవారు పెండ్లిమండపం వద్ద కొలువుదీరారు. వెండి కవచాలంకృతమై అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఇక రెండో అమ్మ వారు ముత్యాలమ్మ భేరివారిమండపం వద్ద దర్శనమిచ్చారు. మూడో అమ్మవారు అంకాళమ్మ సన్నిదివీధి రాజగోపురం పక్కన కొలువు దీరి వెండి ఆభరణాల అలంకారంలో భక్తులను కటా క్షించారు. నాలుగో అమ్మవారు నల్లగంగమ్మ బ్రాహ్మణవీధిలో, ఐదో అమ్మవారు కావమ్మ పూసల వీధిలో, ఆరో అమ్మవారు అంకమ్మ గాంధీ వీధిలో కొలువై విశేష అలంకారాల్లో దర్శన మిచ్చారు. ఏడవ అమ్మవారు భువనేశ్వరి కొత్త పేటలో ఊంజలసేవ అలంకారంలో దర్శనమిచ్చారు.

వేషాలు.. బలులు.. అంబళ్లు

జాతర సందర్భంగా అమ్మవార్లకు కుంభం, కోడిపుంజులు, వేటలు సమర్పించారు. పలువురు అంబలి సమర్పించి వితరణ చేశారు. పెండ్లిమండపం వరకు ఏడుగురు అమ్మవార్లు ఊరేగింపుగా వచ్చారు. అక్కడి నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడకు వెళ్లి కొలువుదీరారు. పట్టణమంతా రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది. కొందరు భక్తులు 108 కొబ్బరికాయలను కూడా కొట్టి మొక్కు తీర్చుకున్నారు. మరికొందరు వివిధ వేషధారణలతో సందడి చేశారు. మహిళలు, పిల్లలు వేపమండలను చీరలుగా ధరించి వెయ్యికళ్ల దుత్తలను సమర్పించారు.

జాతర ప్రశాంతం

జాతర అత్యంత ప్రశాంతంగా ముగిసింది. యేటా జాతరలో మద్యం మత్తులో చెదురు ముదురు ఘటనలు, చిన్న చిన్న ఘర్షణలు జరిగేవి. ఒక్కోసారి పెద్దగొడవలు తోపులాటలకు దారి తీసేవి. ఈ యేడాది పాత గంగమ్మ కమిటీలను మార్చి ఈ సారి కొత్త కమిటీలను ఆయా గంగమ్మల నిర్వాహకులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో శ్రీకాళహస్తిలో నెల రోజుల ముందే జాతర చందాల సేకరణ నుంచే వర్గపోరు తెరమీదకు వచ్చింది. దీంతో ఎక్కడ రాజకీయ రగడకు జాతర వేదిక అవుతుందోనన్న తీవ్ర ఆందోళన అధికారుల్లో మొదలైంది. ఎస్పీ సుబ్బరాయుడు జాతర పర్యవేక్షణపై అధికారులను ఎప్పటికపుడు ఆరా తీశారు. ఏఎస్పీ రవి మనోహరాచారి శ్రీకాళహస్తికి చేరుకుని స్వయంగా బందోబస్తును కసరత్తు చేశారు. ఎక్కడా సమస్య ఉత్పన్నం కాకుండా పగడ్బందీగా పోలీసు యంత్రాంగం ముందు నుంచే అడుగులు వేసింది. శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి పదిరోజుల ముందు నుంచే రౌడీషీటర్లు, పాతనేరస్థులను బైండోవర్ చేశారు. అలాగే గతంలో జాతర వేదికగా గొడవలు చేసిన ఆకతాయిల వివరాలను తీసుకుని వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో తొలిసారి ఎలాంటి గొడవలకు తావులేకుండా అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగింది.

నూతన ఆవిష్కరణలే హ్యాకథాన్ లక్ష్యం

ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ




సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ - కోడింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు- హ్యాకథాన్‌కు హాజరైన విద్యార్థుల బృందం

ఏర్పేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక రంగంలో భారతావని ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఐఐటీలో బుధవారం 7వ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే ఈవెంట్‌ను ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇక్కడి ప్రాంగణంలో 21 బృందాలకు సంబంధించి మొత్తం 126 మంది యువ ఆవిష్కర్తలు పాల్గొన్నారన్నారు. కాగా సాఫ్ట్‌వేర్ ఎడిషన్‌పై 36 గంటల పాటు నిరంతరాయంగా భారత విద్యా మంత్రిత్వ, ఆయుష్ శాఖలు ఇచ్చిన సమస్య సాధన ప్రక్రియ కొనసాగుతోంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువ ఆవిష్కర్తలు తమకు కేటాయించిన అంశాలకు సంబంధించి వారి సృజనాత్మకతను ఉపయోగించి సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణను రూపొందించారు. ఆయుర్వేదిక్ కళాశాల ప్రిన్సిపాల్ రేణుదీక్షిత్ ప్రారంభ వేడుకల్లో పాల్గొన్నారు.

భూములకు పరిహారం ఇప్పించండి

ఎమ్మెల్యే సుధీర్‌కు వికృతమాల రైతుల మొర


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): విమానాశ్రయ విస్తరణ పనుల కోసం తీసుకున్న భూములకు పరిహారం ఇప్పించాలని వికృత మాల రైతులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి విన్నవించారు. వికృతమాల రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. విమానాశ్రయానికి తాము భూములు ఇచ్చామని 52 మంది రైతులు సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. అదే విధంగా ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ ఈఎంసీకి తాము 18మంది రైతులు భూములు ఇవ్వగా వాటికి పరిహారం అందలేదన్నారు. అలాగే జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వ అవసరాల కోసం ఉంచుకున్న భూమిని 82మందికి ఇంటిస్థలాలు ఇచ్చారని వికృతమాలవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి, తహసీల్దారు భార్గవిని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ నాయకులు పేరం ధనుంజయులునాయుడు,మోహన్‌రావు, నిరంజన్ బాబునాయుడు, సీఐ జయచంద్ర, డీటీలు, ఆర్‌ఐ సుబ్రహ్మణ్యం, వీఆర్వో చంద్రశేఖర్ పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు పూల హేమాక్షి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

బుచ్చినాయుడుకండ్రిగలో...

బీఎన్‌కండ్రిగ మండలంలోని కొత్తపాళెంలో బుధవారం రెవెన్యూ సదస్సు డిప్యూటీ కలెక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అడంగళ్, 1బీ, రిజిస్టర్, 22ఏ భూములు, భూమి కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్ల సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ సర్వేలో తప్పులు, అసైన్డ్, చుక్కల భూములు, పరాధీనం వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. డిప్యూటి తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, ఆర్‌ఐ నల్లయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నారాయణవనం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం బైపాస్ వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పుత్తూరు మండలం గేటు పుత్తూరుకు చెందిన ఎం.వి. నాగలింగం(31) ద్విచక్రవాహనంపై కీలగరం వస్తూ, ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయాలవడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ బోర్డులు ఏర్పాటు చేయండి


ఏసీబీ అడిషనల్ ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న త్యాగరాజు

వరదయ్యపాళెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీబీ బోర్డులు ఏర్పాటు చేయాలని సీసీఆర్ రాష్ట్ర కార్యదర్శి గుత్తి త్యాగరాజు కోరారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఏసీబీ కార్యాలయంలో బుధవారం అడిషనల్ ఎస్పీ విమలకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 9న అవినీతి వ్యతిరేక దినం సందర్భంగా వారం రోజుల పాటు అవగాహన కల్పిస్తున్నామన్నారు. లంచం అడిగితే నెం.9440446130కు ఫిర్యాదు చేయవచ్చని విమలకుమారి చెప్పారు.

ఆర్‌అగ్రహారంలో రెవెన్యూ సదస్సు

రేణిగుంట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ అగ్రహారంలో తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఐదు దరఖాస్తులు అందాయి. వివాదంలో ఉన్న ఇంటి స్థలం సమస్య పరిష్కరించాలని రెండు, ఇంటి పట్టాల కోసం రెండు, భూఆక్రమణపై ఫిర్యాదు వచ్చింది. ఆర్‌ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల దుస్థితిపై అధికారుల నిలదీత

వరదయ్యపాళెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం అరూరు గ్రామస్తులు అధ్వానంగా ఉన్న రోడ్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆరూరు- మాదరపాకం రోడ్డు దెబ్బతిని మూడేళ్లు గడుస్తున్నా కనీసం మరమ్మతులు చేపట్టలేదని మండిపడ్డారు. పలుమార్లు వినతలు ఇచ్చినా బుట్టదాఖలు చేశారన్నారు. ప్రతిసారి ప్రతిపాదనలు పంపాం.. నిధులు వస్తే బాగు చేస్తాం... అని చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. మాజీ సర్పంచు శేఖర్ రోడ్డు దుస్థితికి సంబంధించిన ఫొటోలను అధికారులకు చూపించారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ... నెలరోజుల్లో రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ

పిచ్చాటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్ రెడ్డి అన్నారు. పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి దాన్ని సంరక్షిస్తే పర్యావరణాన్ని కాపాడిన వాళ్లవుతారన్నారు. చెట్లు ఎక్కువగా ఉంటే ఆ ప్రాంతంలో సంవృద్ధిగా వర్షాలు పడతాయని, స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు గిరిప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన కార్మికుల దీక్ష

వరదయ్యపాళెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం పాలగుంట జ్యూస్ పరిశ్రమలో 20 సంవత్సరాలుగా పని చేసిన తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడంపై 45మంది కార్మికులకు దీక్ష నిర్వహిస్తున్న విషయం విదితమే. వారి నిరసన బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తొలగించిన తమకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయవాది రాజా, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మౌనరాజ్, నేతాజీ, శేఖర్, రాహుల్, అజిత్ తదితరులు కార్మికులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు.

ఆవుల పెంపకం, వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ఏర్పేడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌వోఎస్ చిల్డ్రన్ విలేజ్‌లో వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆవుల పెంపకం, వ్యర్థాల నిర్వహణపై బుధవారం శిక్షణ ఇచ్చారు. పల్లం, ఉడమలపాడు, అక్కుర్తి క్లస్టర్ల నుంచి 50మంది సంరక్షకులు పాల్గొన్నారు. పశువుల పేడ నుంచి సీడ్ బాల్స్, మష్రూమ్ గ్రోబ్యాగ్స్, పూల కుండీలు, ధూపం కప్పులు, సేంద్రియ సబ్బుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ సీసీపీ ఈసీ కోఆర్డినేటర్ సుజాత, ఎస్‌వోఎస్ కార్యాలయ సమన్వయకర్త సత్యనారాయణ, సహాయకారి మునిరత్నం పాల్గొన్నారు.

అడుగడుగునా గుంతలే!


గుంతలమయమైన కొత్తపాళెం రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాళెనికి వెళ్లే తారు రోడ్డు అడుగడుగునా గుంతలమయమవడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గ్రామీణులు చెబుతున్నారు. శ్రీకాళహస్తి - తడ రోడ్డు నుంచి రెండు కిలోమీటర్ల వరకు 20 సంవత్సరాల క్రితం తారు రోడ్డు నిర్మించారు. అయితే ఆ తరువాత నిర్వహణను పట్టించుకోలేదు. దీంతో రోడ్డు గుంతలు తేలడంతో రెండు కిలోమీటర్ల దూరానికి సుమారు అరగంట పడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పరిస్థితి దారుణంగా మారిందని గ్రామస్తులు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

వాహనదారులకు లైసెన్సు తప్పని సరి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు హెచ్చరించారు. చెక్ పోస్టు సమీపంలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు, లైసెన్సులు తనిఖీ చేశారు. రికార్డులు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు. రెండో సారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

పంటల బీమాపై అవగాహన

వరదయ్యపాళెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరుదూరు, కదూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సత్యవేడు సహాయ వ్యవసాయ సంచాలకుడు సుబ్రహ్మణ్యం పంట నమోదును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. రబీకి సంబంధించి రైతులు పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. ప్రీమియం చెల్లించే విధానాన్ని వివరించారు.

జాతరలో బాలుడికి గాయాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏడుగంగమ్మల జాతరలో ఓ బాలుడు(15) గాయపడ్డాడు. ఎందుకు, ఎలా గాయపడ్డాడు అన్న విషయాన్ని బాలుడి కుటుంబసభ్యులు వెల్లడించేందుకు నిరాకరించారు. శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన విద్యార్థి స్నేహితులతో కలిసి మంగళవారం రాత్రి జాతర వేడుకల్లో పాల్గొన్నాడు. ఏడుగంగమ్మల ఆలయం గంగమ్మ చప్పరం పక్కన నిలబడుకుని ఉండగా మెడకు గాయమైందంటూ ఆ బాలుడు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రాత్రి 2గంటల సమయంలో చేరాడు. కాసేపటికి కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని తమ బిడ్డను ఇంటికి తీసుకెళ్లారు. దీనిపై ఎలాంటి వివరాలను వారు వెల్లడించలేదు. అలాగే పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

సింగిరికోన రోడ్డు నిర్మాణానికి రూ.4.95 కోట్ల మంజూరు

నారాయణవనం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిరికోన లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ప్రభుత్వం నారాయణవనం - నాగలాపురం రోడ్డు నుంచి వెంకటకృష్ణపాళెం, నాగిలేరు మీదుగా రోడ్డు నిర్మాణానికి రూ.4.95 కోట్లు నిధులను మంజూరు చేసిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గుణవంతరావు తెలిపారు.